AL - HILAL

నెలవంక

మాస పత్రిక

Vol 6, Issue: 44 June - 2010

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى





ఒక మనిషి - రెండు వైఖరులు



కన్న కలలు కల్లలాయె... కడకు మిగిలింది కన్నీళ్ళేనాయె....



కారు చీకట్ల నుంచి కాంతి రేఖల వైపునకు



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఉచితం



"తల్లిదండ్రులకు సేవ చేయాలని మేము మానవుడ్ని ఆదేశించాము. అతని తల్లి బాధ మీద బాధ భరిస్తూ అతడ్ని తన గర్భంలో పెట్టుకుని మోసింది. అతడ్ని పాలు విడిపించటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (అందువల్ల మేమతనికి ఇలా ఉపదేశించాము) "నా పట్ల కృతజ్ఞుడవై ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతా భావంతో మసలుకో. నీవు చివరికి నా దగ్గరికే మరలి రావలసి ఉంది". (దివ్య ఖుర్‌ఆన్ - 31: 14)





నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 6, ISSUE: 44
JUNE 2010

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhammad Azeezur Rahman

EXECUTIVE EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONES
M.Azeezur Rahman
66104547
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc-kw.com

DESIGN
Noushad Zainulabdeen

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

దృక్పథం	2
ఒక మనిషి - రెండు వైఖరులు	3
హలాల్ సంపాదన వికసిస్తుంది	4
కన్న కలలు కల్లలాయె...	6
రహస్య సమాలోచన	9
గుండెలోని ప్రాణం...	10
ధర్మ సందేహాలు	11
ప్రార్థన (దుఆ)	12
కవితా కుసుమాలు	13
ప్రథమ ఖలీఫా అబూ బకర్ (ర)	14
నేటి బాలలే రేపటి పౌరులు -2	18
చర్చీల నుండి మస్జిద్‌ల వైపునకు -3	19
లాభపాటి వర్తకం	20



◄ الرؤية (كلمة العدد) ◄ إنسان ذو فطرة ◄ الرزق الحلال ◄ الخدع (قصة المهتدية)
◄ سر النجاح (نشيد) ◄ من قبل أن يأتيكم الموت ◄ الفتاوى الشرعية ◄ تربية المهتدين
◄ نشيد (أسوة الرسول) ◄ انك كادح إلي ربك كدحا فملاقيه (نشيد) ◄ سيرة سيدنا أبو بكر
◄ أخبار اللجنة ◄ روضة الأطفال ◄ تتمة قصة المهتدية
◄ تجارة تنجينا من العذاب (روضة المحبين) ◄ غسيل الملائكة (قصة الصحابي الجليل)

దృక్పథం



విజన్



విజన్...!
దార్శనికత...!!
కల...!!! ....
రూయత్...!!!!

మానవుడు పుడమిపై పాదం మోపిన నాటి నుంచి నేటి వరకూ – సర్వకాల సర్వావస్థల్లో– తన భవిష్యత్తుపై 'కలలు' కంటూనే ఉన్నాడు. నేటి గ్లోబలైజేషన్ యుగంలో ఈ విజన్ (vission) మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఒక సగటు మనిషి మొదలుకుని సూపర్‌మాన్ వరకు, చిట్టిపొట్టి ప్రాంతీయ సంస్థల నుండి జాతీయ అంతర్జాతీయ సంస్థల వరకూ – ప్రతి ఒక్కరూ అందమైన, ఉజ్వలమైన భవిష్యత్తును దర్శిస్తున్నారు. బ్లాక్ బోర్డు నుండి పవర్ పాయింటుల వరకూ అందుబాటులో ఉన్న ప్రతి ప్రచార, ప్రసార సాధనం ద్వారా తమ కలల (vission) ప్రపంచాన్ని చూపించి, అనుచర గణాన్ని తన్మయుల్ని చేస్తున్నారు.

విజన్ విద్యా విషయకమైనా, ఆర్థికమైనదైనా, వైజ్ఞానికమైనదైనా, ఆధ్యాత్మికమైనదైనా – మనిషి కలలు కనటం తప్పు కాదు. పైగా కల గనటం అతని జన్మ హక్కు. కాని అది కేవలం తియ్యని కల కారాదు. మనిషికి తన విజన్‌పై నిబద్ధత ఉండాలి. దృఢ నమ్మకం ఉండాలి. వజ్ర సంకల్పం ఉండాలి. విజన్ (కల)ని కేవలం చర్మ చక్షువులతో వీక్షిస్తే సరిపోదు. దానికి మనో నేత్రం కూడా కావాలి. తాను వల్లించే నీతి సూత్రాలు, తాను రచించే భవిష్యత్ప్రణాళికలు తన విజన్ (దార్శనికతా) చట్రంలో సరిగ్గా ఇమిడిపోతాయో లేదో ఆలోచించి అర్థం చేసుకునే మనోమస్తిష్కాలు కూడా ఉండాలి. దాంతోపాటు అందమైన తన స్వప్నాన్ని సాకారం చేసుకోవటానికి సకారాత్మకమైన వైఖరిని అవలంబించాలి. అన్యులకు హానికరం కాని మార్గాన్ని ఎంచుకోవాలి. సవ్యమైన, సత్యబద్ధమైన దిశలో సాగిపోయేలా దిశా నిర్దేశం చేసుకోవాలి.

ప్రవక్తలు, మునులు, మహాత్ముల నుండి నియంతలు నిరంకుశ చక్రవర్తుల వరకు – అందరూ కలలుగన్నవారే! కాని తమ కలలను నిజం చేసుకోవటానికి వారు అవలంబించిన విధానాలు మాత్రం విభిన్న రీతుల్లో ఫలించాయి. జర్మనీలో పుట్టిన నాజిజంకైనా, ఇటలీలో ఉద్భవించిన ఫాసిజంకైనా విజన్ లేకపోలేదు. హిట్లర్, ముస్సోలినీ దొరలు కూడా కలలు గన్నవారే. వారిలోనూ దార్శనికత (vission) ఉండేది. కాని ప్రపంచంలోని ఇతర మానవ జాతులన్నింటినీ తుదముట్టించి తమ జాతికి మాత్రమే పట్టం కట్టాలన్న వారి జాత్యాహంకార బుద్ధి బెడిసి కొట్టింది, చివరికి పరాభవాన్నే మిగిల్చింది.

అయితే దుష్ట శిక్షణ – శిష్ట రక్షణ నిమిత్తం నడుం బిగించిన మహాత్ముల, లోక కళ్యాణార్థం ప్రభవించిన ప్రవక్తల దార్శనికత (విజన్) తద్భిన్నంగా ఉంటుంది. ఈ మహనీయులు తరం తరం..... నిరంతరం తమ విజన్ (vission) ని సత్య నిబద్ధతతో దర్శిస్తారు. వారు ఓటమిలోనూ విజయాన్ని వీక్షిస్తారు. దాన్ని చేరుకోవటానికి అహరహం శ్రమిస్తారు. దాని కోసం తమ మూల విరాట్టునే ఆశ్రయిస్తారు. మౌలిక విలువలనే అవలంబిస్తారు.

మక్కా సర్దారులు ప్రకటించిన పారితోషికానికి ఆశపడి – మదీనాకు మహా ప్రస్థానం చేస్తున్న ముహమ్మద్ (స)ను వెంబడించిన వారిలో సురాఖా బిన్ మాలిక్ ముఖ్యుడు. నేలలో కూరుకుపోతున్న తన గుర్రాన్ని చూసి అతను భయకంపితుడైపోయి, తనను క్షమించమని ప్రవక్తను ప్రాధేయపడినపుడు ఆ కారుణ్యమూర్తి (స) ఏమన్నారో తెలుసా!? "ఓ సురాఖా! కిస్రా (ఈరాన్) సింహాసనాధిపతి తొడిగే మణిఖచిత కంకణాలు నీ చేతికి తొడిగించబడిన నాడు నీ వైభవం ఎలా ఉంటుందో ఊహించుకో!" – ఇదీ విజన్ అంటే!

సామాన్యుల విజన్‌కి – మహనీయుల విజన్‌కి మధ్య గల వ్యత్యాసం ఇదే మరి! కిస్రా వజ్ర వైఢూర్యాలు దేశ దిమ్మరులయిన అరబ్బుల పాదాక్రాంతమవటానికి, సురాఖా చేతికి కిస్రా కంకణం తొడగటానికి అట్టే కాలం పట్ట లేదు.

హుదైబియా ఒడంబడిక జరిగినపుడు ప్రవక్త ప్రియ సహచరులు ఒకవైపు అవమానభావంతో, ఉక్రోషంతో ఊగిపోతుంటే, మరో వైపు మహాప్రవక్త (స) నిశ్చింతగా, నిక్షేపంగా ఉండటం కూడా ఒక వింతగానే కనిపిస్తుంది. ఎందుకంటే ఆ క్షణాల్లో ఆ మహనీయుని ముందున్న విజన్‌ని సామాన్యులు దర్శించలేరు. ఎందుకంటే – لخبد صدخللاهو رسولاهو رايا بيل هاخي (ఖచ్చితంగా అల్లాహ్ తన ప్రవక్తకు సత్యంతో కూడిన విజన్ –vission–ని చూపించాడు).

వర్ష తెగల విష కోరల్లో నలిగిపోతున్న అరేబియా ద్వీపం భవిష్యత్తుపై అదీ బిన్ హాతిమ్ ప్రశ్నల వర్షం కురిపించినప్పుడు ఆ మహా మనీషి (స) చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో చెప్పిన సమాధానాల్లో ఒకటి ఇలా ఉంటుంది – "ఓ అదీ! నువ్వే చూద్దువుగాని! ఒక రోజు రానున్నది – అప్పుడు హజర్‌మౌత్ (యమన్) నుండి ఒంటరిగా బయలుదేరిన ఒక స్త్రీమూర్తి మక్కా వరకు నిక్షేపంగా వచ్చి కాబా తవాఫ్ చేసి వెళుతుంది. ఆమెకు తన ధన, మాన ప్రాణాల గురించి ఎలాంటి భయం ఉండదు". ఈ విధంగా ఆ మహోపకారి చెప్పిన ప్రతిదీ అక్షరాలా నెరవేరినది. ప్రపంచంలో మానవత్వం పరిఢవిల్లింది.

అవును. మనిషికి దార్శనికత (విజన్) అవసరమే. అయితే దాన్ని సాకారం చేసుకోగోరేవారు మనసున్న మనుషులుగా మారాలి. విజన్‌ని నిశ్చిత జ్ఞానంతో చూడగలిగే నిబద్ధత కూడా ఉండాలి. విజన్ కోసం కేవలం రెండు నేత్రాలు సరిపోవు, దాన్ని వీక్షించడానికి మనిషికి 'మూడో కన్ను' కూడా కావాలి. అదే మనో నేత్రం (బసీరత్)!



- హసన్ సయ్యిద్

ఒక మనిషి - రెండు వైఖరులు

ఈ క్షణంలో అది ఒక మిశ్రమ బిందువు, మరుక్షణంలో అదొక నెత్తుటి గడ్డ, ఇంతలోనే అదొక మాంసపు ముద్ద, అంతలోనే ఓ సూతన సృష్టి - అదే మానవాత్మ, అతనే మానవుడు. మనిషి ఈ ఉనికి క్రమాన్ని మహితుడైన అల్లాహ్ ఇలా తెలియ జేస్తున్నాడు:

"నిశ్చయంగా మేము మనిషిని మట్టి సారంతో సృజించాము. తరువాత అతన్ని వీర్య బిందువుగా చేసి ఓ సురక్షిత చోటులో నిలిపి ఉంచాము. మరి ఆ వీర్య బిందువును ఘనీభవించిన రక్తంగా చేశాము. మరి ఆ రక్తపు ముద్దను మాంసపు పిండంగా మార్చాము. దరిమిలా ఆ పిండాన్ని ఎముకలుగా చేశాము. పిదప ఆ ఎముకలకు మాంసం తొడిగించాము. అటుపిమ్మట దాన్ని భిన్నమైన సృష్టిగా ప్రభవింపజేశాము".

(మోమిన్: 12-14)

అవనిపై ఓ అపరిచిత ప్రాంతంలో కళ్ళు తెరిచిన ఈ మానవుడు బాల్యం, కౌమార దశల్ని దాటుకుంటూ నిండు యౌవనస్థుడై నిలుస్తాడు. విద్యాక్రీడ విన్యాసాలతో, జ్ఞానసాగర జలకాలాటలతో విజృంభవుతాడు. ప్రకృతి రీత్యా తనకు ప్రాప్తమైన ప్రతిభా పాటవాలను పదును పెట్టి ప్రగతి పథంలో జీవన రథాన్ని నడిపించి అనూహ్య విజయాల్ని సాధిస్తాడు. ఒక పట్టున క్రాంతికారుడిగా, వేరొక తట్టున కారుణ్య మూర్తిగా, తృటిలో వక్తగా, ప్రవక్తగా పద మాలికలను ముత్యాల హారంగా పొదిగి, మాటల మల్లియలతో గుభాళించె మల్లెల పందిళ్ళు వేస్తాడు. సత్య స్ఫూర్తినీ, పరలోక చింతనను కలబోసి మానవతకే వన్నె తెస్తాడు. దివ్యావిష్కృతుల సుజలంతో, మహితోక్తుల జీవ జలంతో నిర్జీవ హృదయాల్లో ప్రాణం పోస్తాడు. మేధావి, స్థిత ప్రజ్ఞుడు అయిన ఈ నరోత్తమునికి సాంఘిక దోపిడిపై తీవ్రమైన జుగుప్స. క్షుద్రమైన మూఢ విశ్వాసాల ఊబి నుండి మనుజ జాతిని కాపాడాలన్నది అతని ప్రబల ఆకాంక్ష. దీన నిరుపేదలు, అనాథలు, వితంతువులు, అభాగ్యుల పట్ల అతనో కారుణ్య దీప్తి, మానవతా మూర్తి. నిరుపమాన నిజ దేవుని శక్తిలోనూ, స్వర్గ ప్రాప్తిలోనూ, లోకశాంతిలోనూ అచంచల విశ్వాసం అతనికి. అంతు చిక్కని మనో వ్యాధుల్ని నయం చేసే నవయుగ వైతాళికుడు. మానవ అంతర్యంలోని చైతన్యంతోనే అతనికి చెలిమి, బలిమి, కలిమి. "బండలు కదలవు. నీరు కదులుతుంది. కదలేది చైతన్యము. కదలనిది జడత్వము. కదిలే చైతన్యాన్ని కదలని జడత్వం అడ్డగించజాలదు" అన్నది అతను అన్న మాటే. ఒక్క మాటలో చెప్పాలంటే ఆదర్శంలో, ఆచరణలో -

అతనో ఆదం
ఒక నూహ్
ఒక ఇబ్రాహీమ్
ఒక మూసా
ఒక ఈసా
ఒక ముహమ్మద్ (ﷺ)!
ఇది మనిషికి సంబంధించిన మంచి వైఖరి.

మనిషి మరో వైఖరిని కూడా ప్రస్తావించినట్లయితే; అది మహా కిరాతకం! నిక్కుతూ నీల్గుతూ నీతినిజాయితీల గొంతు నొక్కేయాలని చూస్తాడు. నియంతలా పెట్రేగిపోతూ, నిజం ఊపిరి తీసేయాలని యత్నిస్తాడు. భూత, వర్తమాన, భవిష్య తీర్మానాలు తన గుప్పెట్లో ఉన్నాయని బీరాలు పోతాడు. భువన గగనాల్లో తనకు మించిన దైవం లేదని విర్రవీగుతాడు. నర మేధమే సాగించి, మారణ హోమమే రగిలించి అందరిలో అగ్రగామిగా నిలవాలను కుంటాడు. అశాంతి, అలజడులకు ఆజ్యం పోస్తూనే శాంతి దూతగా మన్ననలందుకో జూస్తాడు. అసాంఘీకాలు అనేకం చేస్తూనే సాంఘీకాలు బాగానే వల్లిస్తాడు. సత్యానికి సజీవ సమాధి చేయాలనుకుంటూనే సన్మానాలు కావాలనుకుంటాడు. **"అన రబ్బుకుముల్ అలా"** అన్నది అతను చెప్పిన మాటే. 'సీటు కోసం సిద్ధాంతాల్ని మార్చుకునే పదవి లోభత్వం' అతను ప్రవేశ పెట్టిందే. ఒక్క మాటలో చెప్పాలంటే దుర్మార్గం, దౌర్జన్యం, దమన నీతిలో, దమన కాండలో -

అతనో నమ్రూద్,
ఒక ఫిర్‌ఔన్,
ఒక హామాన్,
ఒక ఖారూన్,
ఒక అబూ లహబ్,
ఒక అబూ జహల్,
ఒక అబ్దుల్లా బిన్ ఉబై,
ఒక ముసైలమా,
ఒక చంగీజ్ ఖాన్,
ఒక హిట్లర్,
ఒక ముస్సోలినీ,
ఒక అహ్మద్ ఖాదియానీ,
ఒక షైతాన్!

మనిషి - తానొక్కడే అయినా రెండు వేర్వేరు వైఖరులు అతనిలో ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. నేడు సైతం ఈ రెండు వైఖరులు గలవారు మన సమాజంలో ఉన్నారు. పురుషోత్తములని నీరాజనాలందు కునేవారు కొందరైతే, నరరూప రాక్షసులని అభిశాపానికి గురై అపకీర్తి మూట కట్టుకునే వారు మరికొందరు. ఒక వర్గమేమో స్వర్గానికి. మరో వర్గం మాత్రం ఖచ్చితంగా నరకానికే! అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"వాడు సత్యాన్ని ధృవీకరించనూ లేదు, దైవాన్ని ప్రార్థించనూ లేదు. పైగా సత్యాన్ని ధిక్కరించాడు, వెను తిరిగిపోయాడు. మిడిసి పడుతూ, తన ఇంటివారల వైపు వెళ్ళి పోయాడు. శోచనీయం. నీ వైఖరి కడు శోచనీయం. మరి విచారకరం. నీ ధోరణి మిక్కిలి విచారకరం. ఏమిటీ, తనను (తన ఇష్టానికి) ఇట్టే వదలి పెట్టడం జరుగు తుందన్న భ్రాంతికి లోనై ఉన్నాడా మానవుడు?" (ఖియామహ్: 31-36)

"ధిక్కార వైఖరిని అవలంబించేవారికి ఆ రోజు వినాశనం ఖాయం. ఆ రోజు వారు మాట్లాడనూ లేరు. సంజాయిషీ ఇచ్చుకునే అనుమతి కూడా వారికి ఇవ్వబడదు".

(ముర్సలాత్: 34-36)



శాంతి ప్రియ

ధర్మం

మనిషికి ఒక అవసరం. దాని కోసం ప్రతి మానవుడు చాలా ప్రయత్నాలు చేస్తాడు. ధనం సంపాదించటానికి ప్రపంచంలో ఎన్నో మార్గాలున్నాయి. అందులో కొన్ని అధర్మమైనవీ, కొన్ని సక్రమమైనవైతే, కొన్ని అక్రమమైనవని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతి మనిషి ధన సంపాదన కొరకై అవలంబిస్తున్న మార్గం ధర్మ సమ్మతమైనదా లేక అధర్మమైనదా? అని ఆలోచించాలి. ఎందుకంటే మనందరినీ సృష్టించిన దేవుడు అక్రమ మార్గాల్లో ధనం సంపాదించటాన్ని నిషేధించాడు. ధర్మసమ్మతమైన మార్గాన్నే అవలంబించాలని ఆదేశించాడు.

ప్రతి మనిషీ విశ్వసించాల్సిన ఒక విషయం దైవ గ్రంథంలో ఉంది. అదేమంటే మావ సమాజానికి హాని కలిగించే పద్ధతులనే దేవుడు నిషేధించాడు, మంచి మార్గాలన్నింటినీ ధర్మసమ్మతం చేశాడు. దైవం నిషేధించిన మార్గంలో మనిషికి శ్రేయం, శుభం రెండూ లేవు, దైవం ధర్మసమ్మతం చేసిన మార్గంలో మనిషికి శ్రేయం, శుభం రెండూ కలుగుతాయి. కానీ మానవులు ధనవంతులైపోవాలనే ఆశలో పడి మంచి – చెడు, ధర్మం – అధర్మమన్న మాటే మరచిపోయారు. నిర్భయంగా అక్రమ మార్గాల్లో అమాయకులను దోచుకుని, విచ్చలవిడిగా అధర్మ సంపాదనను ఆరగిస్తున్నారు. వాస్తవానికి దైవం మరియు దైవ ప్రవక్త ﷺ అక్రమ మార్గాలను నిషేధించి, అధర్మానికి పాల్పడినవారికి కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు.
ఉదాహరణకు ఈ విధంగా ఆదేశించబడింది: “మీలో మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి. బుద్ధిపూర్వకంగా, అక్రమమైన పద్ధతిలో ఇతరుల ఆస్తిలో కొంత భాగాన్ని కాజేసేటందుకు అధికారులకు ముడుపులు చెల్లించకండి”. (బఖరా: 188)

మహనీయ ముహమ్మద్ ﷺ ఇలా తెలియజేశారు: “మీలోని ప్రతి ఒక్కరి – రక్తం (ప్రాణం), ధనం మరియు మానం (కాజేయటం) మరొకరిపై నిషేధించబడింది”.

ఓ సందర్భాన ప్రవక్త మహనీయులు ﷺ ఇలా తెలియజేశారు: “శరీరంలోని ఏ భాగమైతే అక్రమ సంపాదనతో పెరుగుతుందో అది నరకాగ్నికి అతి చేరువవుతుంది”.
మరో సందర్భంలో ఇలా హెచ్చరించారు: “మానవుల్లో కొంత మంది వేరొకరి సంపాదనలో అక్రమంగా జోక్యం చేసుకుంటారు. అలాంటివారు రేపు పరలోకంలో నరకానికి ఆహుతి అవుతారు”.

మానవులు దేని కారణంగా ఎక్కువ నరకానికి చేరుతారని ప్రవక్త ﷺను ప్రశ్నించగా – “మర్మాంగం మరియు నోరు (ఈ రెండింటి) కారణంగా మానవులు అధికంగా నరకానికి చేరుతార”ని ప్రవక్త ﷺ చెప్పారు.
ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే, నోటి ద్వారా దుర్భాషలాడటం, నిందలు మోపటం, అపద్ధపు సాక్ష్యాలు పలకటం లాంటివి మానవుణ్ణి నరకానికి చేర్చే ఒక కారణమైతే, ఆ నోటి ద్వారా అధర్మ సంపాదనను ఆరగించటం మరో కారణమౌతుంది.

నష్టాలు

అక్రమ సంపాదన వల్ల ప్రజల్లో మానవత్వం నశించిపోవటమే కాకుండా కొన్ని ఇతరత్రా నష్టాలు కూడా జరుగుతాయి.

దేవునితో తన సమస్యలను పరిష్కరించుకోవటానికి మానవుని కోసం దైవం తరఫున ప్రతిపాదించబడిన మార్గం ప్రార్థన. అక్రమంగా సంపాదించిన ఆహారం కేవలం ఒక్క మెతుకు భుజిస్తే అతని 40 రోజులు పార్థన స్వీకరించబడదని ప్రవక్త (ﷺ) హెచ్చరించారు. మరి జీవితం మొత్తం అక్రమ సంపాదనతోనే గడిపేస్తున్నవారి పరిస్థితి ఏమౌతుందో ఆలోచించవలసి ఉంది.

ఒకసారి దైవప్రవక్త (ﷺ) తమ అనుచరులకు ఒక ఉదాహరణ ద్వారా ఇలా తెలియజేశారు: **"ఒక బాటసారి చాలా దూరం నుండి ప్రయాణం చేసి వస్తాడు. (ప్రయాణం వలన) అతని ముఖం దుమ్ము కొట్టుకుని, జుత్తంతా చిందరవందరగా ఉంటుంది. అతను రెండు చేతులెత్తి 'ఓ దేవా! ఓ నా దేవా!, అని కడు దీనంగా ప్రార్థిస్తాడు. కాని అతను తినే తిండి హరామ్ తిండి, అతను త్రాగేది కూడా హరామే. అతను ధరించిన దుస్తులు కూడా హరామ్ దుస్తులే. అతని శరీరం అధర్మ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుంది?"**

అక్రమంగా సంపాదించినవాడు, దాన్ని ఆరగించినవాడు నరక శిక్షలు అనుభవిస్తాడని దైవ ప్రవక్త (ﷺ) చాలా సందర్భాలలో హెచ్చరించారు. అక్రమ సంపాదనలో దైవం తరఫున శుభం కలుగదు. అతను ఎంత తిన్నా కడుపు నిండదు. అతనికి మనశ్శాంతి కలుగదు. అందుకే మన పూర్వీకులు, ప్రవక్తలు, సహాబాలు, ఇమాములు, విద్వాంసులు అక్రమ సంపాదనకు దూరంగా ఉండేవారు.

ముస్లింల ప్రథమ ఖలీఫా అబూ బకర్ (رضي الله عنه) ముందు, ఆయన బానిస తినటానికి ఒక పదార్థం సమర్పించాడు. అబూ బకర్ (رضي الله عنه) దాని గురించి విచారించకుండానే ఆరగించారు. కాని తను భుజించిన పదార్థం అక్రమంగా ఆర్జించబడిందని తరువాత ఆయనకు తెలిసింది. వెంటనే నోటిలో వ్రేళ్ళు వేసి అతి కష్టం మీద తిన్నదంతా కక్కేశారు. ఈ వైనాన్ని చూసిన ఒకరు, 'చిన్న పదార్థం తిన్నంత మాత్రానికే ఇంతగా ఆందోళన ఎందుక'ని ప్రశ్నించగా, "మానవుని శరీరంలోని ఏ భాగం అక్రమ సంపాదనతో ఎదుగుతుందో అది నరకాగ్నికి ఆహుతి అవుతుందని ప్రవక్త (ﷺ) వారు చెబుతుండగా నేను విన్నాను. ఈ పదార్థం వల్ల నా శరీరంలో ఒక్క చుక్క రక్తమయినా తయారయిందంటే నేను నరకానికి వెళ్ళాల్సి వస్తుందని భయపడి ఇలా చేశాన" ని జవాబిచ్చారు.

ఇమామ్ అబూ హనీఫా (రహ్మ) బట్టల వ్యాపారం చేసేవారని చరిత్ర కారులు చెబుతారు. ఒకసారి థానులోని లోపాన్ని చూపించిన మీదటే అమ్మమని తన గుమాస్తాకి ఆదేశించి బయటికి వెళ్ళారు. కొద్దిసేపటికి ఒక కస్టమర్ వచ్చాడు. అతనితో మాటల్లో పడి థానులోని లోపాన్ని చూపాలన్న విషయం మరచిపోయాడా గుమాస్తా. పది వేల దిర్హముల బట్టలు కొని కస్టమర్ వెళ్ళిపోయాడు. తరువాత అబూ హనీఫా (రహ్మ) తిరిగివచ్చినప్పుడు ఆ గుమాస్తా తాను పది వేల దిర్హముల బట్టలు అమ్మినానని లెక్కలు చెబుతూ... థానులోని లోపం చూపలేక పోయానని చెప్పాడు. ఈ మాట విన్న వెంటనే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ) ఆ పది వేల దిర్హములు అధర్మమైనవనీ, అవి తన సంపాదనలో కలిసిపోకూడదని భావించి బీదవారికి దానం చేసేశారు.

"మానవుల్లో కొంత మంది వేరొకరి సంపాదనలో అక్రమంగా జోక్యం చేసుకుంటారు. అలాంటి వారు రేపు పరలోకంలో నరకానికి ఆహుతి అవుతారు".

మన పూర్వీకులు, మహనీయులు అక్రమ సంపాదనకి ఎలా దూరంగా ఉండేవారో గమనించటానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. మరి నేడు మన పరిస్థితిని చూడండి! నేడు మనం వర్తకంలో ఈ నిజాయితీని పాటించటం లేదు. హలాల్-హరామ్, ధర్మం-అధర్మం అనే తేడా చూడకుండా సంపాదిస్తూ పోతున్నాం. ఈ దిగజారుడుకు కొన్ని కారణాలు ఇవి కావచ్చు....

1) ప్రతి మనిషి తొందరగా ధనవంతుడైపోవాలని ఆశపడుతున్నాడు. సంపదలో తన సహచరులను మించిపోవాలని ఆరాటపడుతున్నాడు. ఇలాంటి ఆలోచనతోనే అతను వడ్డీ వ్యాపారం, మత్తు పదార్థాలను అమ్మటం, లంచం తీసుకోవటం, అశ్లీలమైన లిట్రేచర్‌ని అమ్మటం, దొంగతనం చేయటం, మట్కా ఆడటం... ఇంకా దిగజారిపోయి అనేక నీచమైన పనులు చేయటం, మానవత్వాన్నే మరచిపోయి మృగంలా వ్యవహరించటం లాంటి చాలా పనులు చేస్తున్నాడు. వీటన్నింటినీ ఇస్లాం ధర్మం నిషేధించింది.

ఇలా చేసేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి, ఇవి అక్రమ మార్గాలు! నిషేధించబడ్డ మార్గాలు! సలుగురికీ ద్రోహం కలిగించే మార్గాలు! ఇలా దొడ్డి దోవలో వచ్చిన సంపాదనలో శుభముండదు. రేపు పరలోకంలో దేవుని ముందు చేసిన కర్మలకు లెక్క చెప్పటానికి నిలబడినప్పుడు అతను ప్రపంచంలో ధనం ఎలా సంపాదించాడు, ఎక్కడ ఖర్చు చేశాడన్న ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అడుగు కదిలించటానికి వీలు కాదని ప్రవక్త (ﷺ) స్పష్టంగా తెలియజేశారు. ఆ రోజు ఈ అక్రమ మార్గాలతో సంపాదన కొనసాగించేవారు దేవునికి ఏమి సమాధానం చెప్పగలమన్నది ఆలోచించాల్సిన అవసరముంది.

2) అక్రమ మార్గాలతో తప్ప ధర్మసమ్మతమైన మార్గాలతో ధనవంతులం కాలేమని మరి కొందరు భ్రమ పడతారు. ఈ ఆలోచన విశ్వాసానికి, దైవ వాగ్దానాలకి విరుద్ధం. సమస్త జీవరాసులకు సౌభాగ్యాలు ప్రసాదించే ప్రభువు ధర్మసమ్మతమైన సంపాదనలో వృద్ధి కలిగిస్తానని, అక్రమ సంపాదనను క్షీణింపజేస్తానని చెప్పాడు. దైవభీతితో వ్యవహరించేవారికి (అక్రమ సంపాదనలకు దూరంగా ఉండేవారికి) వారు ఊహించని చోటు నుండి సంపాదనను కలుగజేస్తానని కూడా వాగ్దానం చేశాడు.

నేడు అక్రమ మార్గాలకు పాల్పడి రోడ్డున పడ్డవారి ఎన్నో ఉదాహరణలు మనం చూస్తూనే ఉన్నాం. ఒక మార్గం నుండి సంపాదిస్తే పది మార్గాల ద్వారా అది నాశనమైపోవటం కూడా మనం (ప్రపంచంలో) చూస్తున్న విషయమే.

కాబట్టి మనం అక్రమ సంపాదనను ఆశించకుండా ధర్మసమ్మతమైన మార్గాన్నే అవలంబిస్తూ అందులోనే వృద్ధిని ప్రసాదించమని దైవాన్ని వేడుకోవాలి.

తాహెరా బేగం

కన్నకలలు కల్లలాయె...

కడకు మిగిలింది కన్నీళ్ళేనాయె....

– దగా పడ్డ ఓ దీనురాలి దయనీయ గాథ



"ట్రుంటు ట్రూం, ట్రుంటు ట్రూ" నోకియా రింగ్ టోన్‌లో మొబాయిల్ మ్రోగసాగింది. ఇల్లు తుడుస్తున్న లీనా పరుగెత్తుకుని వెళ్ళి ఫోన్ రిసీవ్ చేసింది.

"హెలో గుడ్ మార్నింగ్! నేను వతనియా ఆఫీసు నుండి అయిషాని మాట్లాడుతున్నాను. లీనా గారితో మాట్లాడాలి" (ఉర్దూలో మాట్లాడుతుంది ఆ అమ్మాయి)

"ఆఁ, ఆఁ నేను లీనానే మాట్లాడేది"

"కంగ్రాచ్యులేషన్స్, మీకు ముప్పై వేల దీనార్ల లాటరీ వచ్చింది...." ఉలిక్కి పడింది లీనా. ఆ పెద్ద 'షాక్' నుండి తేరుకుంటూ ఆలోచించసాగింది. తనకు ఉర్దూ వచ్చా రాదా? ఆ ఫోన్‌లోని స్వరాన్ని తను సరిగా అర్థం చేసుకోగలిగిందా? "తీస్ హజార్ దీనార్!" అంటే ముప్పై వేల దీనార్లే కదా!

"నేనేమి వింటున్నాను, ఇది కలా నిజమా?" నా మెదడులో ఉన్న డబ్బు పిచ్చి చెవుల్లో ఈ రూపంలో మారుమ్రోగడం లేదు కదా" ఊహలోకాల్లో తేలిపోతోంది లీనా. అంతలో "మీరు టీ.వి చూడడంలేదా? మేము నాలుగు రోజులుగా మీ పేరున లాటరీ వచ్చిందని ప్రకటిస్తున్నాం".

"నాకదేం తెలియదే! నేనసలు టీ.వి చూడనండీ, అప్పుడప్పుడు తీరిక ఉన్నప్పుడే చూస్తాను".

"మీకు కేష్ కావాలా, చెక్ కావాలా?"

"ఇదేంటీ? నేనింత అదృష్టవంతురాలినా? జీవితాంతం ఇండ్లలో పనిచేసి బ్రతికిన నాకు ముప్పై వేల దీనార్లా! ఓ అల్లాహ్! నాపై ఒక్కసారే ఇంతగా దయ దలిచావా? నిజంగా నీవు కరుణామయుడివి. అమ్మయ్య! హాయిగా ఇండియాకెళ్ళిపోతాను, నా రెక్కలు సుఖపడే సమయమొచ్చేసింది." క్షణంలో రక రకాల కలలు...రకరకాల ఆలోచనలు ముసురు కున్నాయి. "ఓ దేవుడా! ఇది నిజమా?" అని గట్టిగా అరచినట్లడిగింది.

"సిస్టర్! ఇది నూటికి నూరు పాళ్ళు నిజం, మీరు నమ్మలేకున్నారు కదూ! ఒక పని చేయండి, మీ వద్ద ఒకవేళ లాన్డ్ లైనుంటే దాంతో నా నెంబరుపై ఫోన్ చేయండి. మీ మొబైల్‌లోని సిమ్ కార్డ్ తీసి నెంబరు చూసుకోండి. మీ నెంబరు 9636." ఆమె చెప్పినట్లు అలాగే లాండ్‌లైన్‌తో ఆమెకు ఫోన్ చేసింది లీనా. పాపం తనకు ఆ నెంబరు చూడడం తెలియదు. హడావిడిగా తన ఇంగ్లీషు బాస్ వద్దకు వెళ్ళి నెంబరు చూడమని ప్రాధేయపడింది. అతను ఎందుకన్నట్లు ప్రశ్నార్థకంగా ఆమె వైపు చూస్తూ నెంబరు చెప్పసాగాడు. (ఆ నెంబరు అమ్మాయి చెప్పిందే) అరే నిజమే ఆ నెంబరే! ఉంది. ఆ అమ్మాయి మాటలపై పూర్తిగా నమ్మకం కుదిరింది లీనాకు. "ఇప్పుడేం చేయాలి నేను?" అనడిగింది లీనా.

"మీకు కువైట్‌లో బ్యాంక్ అకౌంట్ ఉందా?"

"లేదు"

"ఐతే ఇప్పుడే ఏ షాపు నుండైనా పది పది దీనార్ల 27 వతనియా కార్డులు కొని వాటి నెంబర్లను మాకు తెలియ పరచాలి, వెంటనే మేము మీకు డబ్బు ఏర్పాటు చేస్తాం".

"ఇప్పుడే ఎలా కుదురుతుంది? కాసేపు ఆగి వెళతాను. నేనుండే ఇంటికి షాపు చాలా దూరంగా ఉంది" అంది లీనా. కాని ఆమె ఒప్పుకోలేదు. "నేను లైనులో ఉంటాను. మీరు నాతో మాట్లాడుతూ వెళ్ళండి, కొని తీసుకు రండి" అని పురమాయించింది.

లీనా అబాయా వేసుకొని త్వరత్వరగా తన అకామా కోసం దాచిపెట్టిన 800 వందల దీనార్లలోనుండి 270 దీనార్లు తీసి, బఖాలా నుండి 27 కార్డులు కొని, వారికి నెంబర్లు

చెప్పింది. (ఇలా ఏప్రిల్ నెల 2010 8 వ తేదిన పంపింది) నెంబర్లు తీసుకోగానే ఆ అమ్మాయి ఇలా అంది: "ఒక విషయం సిస్టర్! దీనిలో ఇతరులను ఇన్వాల్వ్ చేయకూడదు, మాకు మరెవ్వరితోనూ పనిలేదు. మేము మీతోనే డయిరెక్ట్‌గా సంప్రదిస్తాము. మీరు మెసేజెస్ చూస్తూ ఉండండి. మరి ఫోన్ రిసీవ్ చేస్తూ ఉండండి, హేవ్ ఎ నైస్ డే" అని పెట్టేసింది.

"యా రబ్బీ! నీవు అపార కరుణా మయుడివి, ఊహకందని చోటు నుండిస్తావు" అంటూ కళ్ళు మూసుకుని గట్టిగా గాలి పీల్చుకుంది లీనా. తను బయటకు వెళ్ళడం, రావడం, నెంబర్లు చెప్పడం అంతా కన్నార్పకుండా చూస్తూ ఆమెను గమనిస్తు న్నాడు ఆమె బాస్. కాసేపటికి తన లోకంలో నుండి బయటపడి చుట్టూ చూడగానే తననే చూస్తున్న బాస్‌ను చూసి ఖంగు తిన్నది లీనా. బాస్‌కు ఈ విషయం చెప్పాలా వద్దా అనే సందిగ్ధంలో పడింది క్షణం. తరువాత ఎలాగైనా చెప్పడం మేలనుకుని సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతూ పూర్తి విషయాన్ని అతనికి వివరించింది. అంతా విని 'ఇలాంటి పిచ్చి పనుల్లో తల దూర్చకు, ఇదంతా ఫ్రాడ్, లాటరీ వస్తే వతనియా వారికి డబ్బు చెల్లించడమేమిటి? ఇవన్నీ పబ్లిక్‌తో డబ్బు లాగే ట్రిక్కులు" అని మందలించాడు. అతని ముందు తల ఊపింది, కాని తన లోపల మాత్రం తనకు పూర్తి నమ్మకం. తను ధనికురాలైపోయింది. ఇక ముందు తనకే లోటూ ఉండదు, అన్ని కష్టాలకు ఇక స్వస్తి' – పైకి మాత్రం ఏమీ చెప్పలేదు. అంతలోనే వారివురి మధ్య ఆవరించిన నిశ్శబ్దాన్ని చీలుస్తూ మెసేజ్. మెసేజ్‌లో తనకు ముప్ఫై వేల దీనార్ల లాటరీ వచ్చిందని, దానికి వతనియా వారు శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారని ఉంది. (ఆ మెసేజ్ నెంబరు 60641262).

తను ఆ మెసేజ్‌ని తన బాస్‌కు చూపించింది, బాస్ దాన్ని నమ్మాలో, నమ్మకూడదో సందేహంగా తేల్చుకోలేక పోయాడు. కార్డులు పంపించిన క్షణం నుంచీ లీనా అందమైన ఊహా లోకంలోనే విహరిస్తోంది. ప్రతి అర్ధ గంటకు ఫోన్ మ్రోగుతూ ఉంది. ఈసారి మళ్ళీ ఉత్కంఠ.

"పాకిస్తానీ మేనేజర్ మీకు శుభాకాంక్షలు తెలియ పరచాలను కుంటున్నారు" అని ఫోన్ అతనికిచ్చింది. "బహుత్ బహుత్ ముబారక్" అని చెప్పి 800 దీనార్లు కట్టి రసీదు తీసుకోండి అన్నాడు మేనేజర్. 800 దీనార్లే? మొన్ననే పది పది దీనార్ల కార్డులు అని కట్టించుకున్నారు. మళ్ళీ అంత డబ్బా, ఓ అల్లాహ్! ఏం చేయాలి? డబ్బు కావాలంటే డబ్బు చెల్లించాలి. తన వద్ద లేదు కాబట్టి తన బాస్‌కు అప్పు ఇవ్వమని అడిగింది. 20 సంవత్సరాలుగా వారింట్లో పని చేస్తుంది కానీ ఎప్పుడూ అలాంటి అవసరం రాలేదు. తను అడగలేదు కాని ఈ సిచ్యువేషన్ వేరు. ...మొత్తానికి తన యజమాని నుండి డబ్బు తీసుకుంది. తను కృతజ్ఞతలు తెలుపుకుని 'అల్ ముల్లా ఎక్స్‌ఛేంజ్' లో కట్టమని వతనియా వాళ్ళు ఫోన్ చేసి చెప్తే కట్టింది. తనకు ఒక విషయంలో చాలా ఆశ్చర్యం వేసింది. అదేమిటంటే ఏ బ్యాంకి పేరూ, అడ్రసు ఏమీ లేకుండా ఒక వ్యక్తి ఎలా డబ్బు తీసుకోగలదు? "ముహమ్మద్ సులైమాన్, సన్ ఆఫ్ ముహమ్మద్ సులైమాన్, పాకిస్తాన్." పేరిట చెక్కు కట్టించుకున్నారు వాళ్ళు. (ఆనాడు కట్టిన డ్రాఫ్ట్ నెంబరు – 6531924598) తన సందేహాన్ని బేంక్‌లో అడిగింది. దానికి వారు "ఆ పేరిట చెక్ పంపిస్తే అతను పాకిస్తాన్‌లో ఏ బ్యాంకీ నుండైనా తీసికోగలడు" అన్నారు. అతను చాలా వలుకుబడి ఉన్న వ్యక్తి కాబోలు అనుకుంది లీనా. బాస్ చెప్పినట్లు వీళ్ళు ఫ్రాడ్ ఆయి ఉండవచ్చు అన్న అనుమానం మాత్రం రాలేదు ఆ పిచ్చి తల్లికి.

డబ్బు అందిన తరువాత కృతజ్ఞతగా మెసేజ్ వచ్చింది. తను పొంగి పోయింది వారి ఎటికేట్స్ చూసి. డబ్బు కట్టిన తరువాత "ఇక్కడకొచ్చి మీ చెక్ తీసుకోండి, అని మెసేజ్ వస్తుందో లేక ఫోన్ మ్రోగు తుందోనని వేయి కళ్ళతో నిరీక్షిస్తుండగా మొబైల్ మ్రోగింది, మొదటి రింగ్‌కే ఆదుర్దాగా రిసీవ్ చేసింది లీనా, అది పాకిస్తాన్ నుండి, కంగ్రాట్స్ చెప్పి (800 దీనార్లు అడిగిన వ్యక్తి) మరలా చాలా తీయగా మాట్లాడి "మీకు చాలా పెద్ద అమౌంట్ వచ్చింది కాబట్టి మీరు 750 దీనార్లు ఒకటి, 400 దీనార్లు, 402 దీనార్లు వేర్వేరుగా పంపించాలి. ఇది మీకు ఇవ్వబడే అమౌంట్ యొక్క టేక్స్. అది కట్టకపోతే డబ్బు తీసుకోవడం వీలు కాదు" అన్నాడు.

ఓ అల్లాహ్! ఇప్పుడే డబ్బు కట్టిని, మళ్ళీ ఎక్కడ్నుంచి వస్తుంది? (తను ఒక ఇంట్లో మేయిడ్‌గా పని చేస్తుందని, ఇప్పటివరకు పంపిన డబ్బు అప్పు తీసికుని పంపానని మళ్ళీ అంత డబ్బు కట్టలేనని ప్రాధేయ పడింది. కాని అతను, నేను కూడా అశక్తుణ్ణనీ, ఇదీ కంపెనీ నిర్ణయం గనక మీరు కట్టాల్సిందే, సిస్టర్! ఎలాగో చేసి కట్టేయండి త్వరలోనే మీ చెక్ మీకొస్తుంది కదా! వెంటనే పంపించాలి, పంపించక పోతే మేము బాధ్యులము కాము" అన్నాడు. అతను అర్జెంట్ అంటూంటే రెండ్రోజుల గడువు తీసుకుంది.

ఆ తరువాత డబ్బు కలెక్ట్ చేయడానికి తను పడిన కష్టాలు తనకే తెలుసు. ఆనాడు నిజంగా తనకి తెలిసి వచ్చింది– తను చేసిన తప్పు. కుమిలి కుమిలి ఏడ్చింది. చేతిలో చిల్లి గవ్వ లేదు. అకామా డబ్బు తప్ప. ఇప్పుడే బాస్ వద్ద 800 దీనార్లు బాకీ. ముప్ఫై వేల దీనార్లు వస్తాయన్న ధీమాతో ఇంతకి తెగించింది. కాని డబ్బు జాడలేదు. ఇప్పుడేం చేయగలదు. సరిదిద్దుకునే చాన్స్ లేదు, డబ్బు పంపించకపోతే వారు బాధ్యులు కారంట. కట్టకపోతే ముందు పంపిన సొమ్ము నట్టేటిలో మునిగినట్లే అనుకుని ఎలాగో ఇది చివరిసారి కదా అని

"విశ్వాసులారా ! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం – ఇవన్నీ అసహ్యకరమైన షైతాన్ పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది."

(అల్ మాయిద: 90)



మళ్ళీ నడుం కట్టింది. అందరు స్నేహితురాళ్ళ వద్ద చందా ఎత్తినట్లు ఒకరి వద్ద నుండి 100, 50, 20, 10 తెలిసినవారందరి దగ్గరా తీసికుని, తన వద్ద అకామా కోసం మిగిలిన డబ్బు అంతా కలిపి మూడు డ్రాఫ్టులుగా పంపించింది. (ఆ డ్రాఫ్ట నెంబర్లు 750 కెడీస్, 8137666130, 402 కెడీస్, 5896797955, 400 కెడీస్, 5590256448) ఇంత డబ్బు పంపే ముందు కనీసం ఈసారన్నా ఎవరినయినా అడుగుదాం, ఏం చేయాలో సలహా తీసుకుందాం అని కూడా ఆలోచించక డబ్బు పంపించేసి పూర్తిగా దివాలా తీసింది. ఆశగా ఎదురు చూస్తోంది, తన ఆశలు అడియాసలౌతాయని కించిత్తు కూడా అనుకోలేదు పాపం. 2,750 దీనార్లు లాటరీ పేరున పంపించి, నిద్రాహారాలు మాని తన తెలివి తక్కువ పనిని ఎవరితో చెప్పుకోలేక కుమిలిపోతోంది. తను ఫోన్ చేస్తే రిసీవ్ చేసేవారెవరూ లేరు. 'ఆ పాకిస్తానీ నెంబరుకు (ఇంటర్నెట్టుతో ఫోన్ చేస్తే నో రెస్పోన్స్'. ఒకసారి తను ఫోన్‌తో చేస్తే చక్కగా మాట్లాడాడు, "మీరు భయపడకండి సిస్టర్! మీ డబ్బులు ఎక్కడికీపోవు చాలా త్వరగా వచ్చేస్తాయి" అని హామీ ఇచ్చి మరో 150 దీనార్లు పంపమని కోరాడు. అయ్యో! ఇంకా నూట యాభై దీనార్లా! సిగ్గులేదా వాడికి అనుకుంది. "భాయి ఇలా చేయడం మీకన్యాయం! పేదరాలిని. పుట్టెడు అప్పులైపోయాయి. కాస్త కనికరించి పంపించండి మీకు మీ పిల్లలకు జీవితాంతం రుణపడి ఉంటాను, దుఆ చేస్తాను. ఆ లాటరీ డబ్బు కాక పోయినా నేను పంపిన డబ్బే నాకు పంపండి" అని వలవలా ఏడుస్తూ విన్నవించుకుంటూ ఉంటే ఫోన్ కట్ చేసేసాడు. అయి పోయింది పాలూ నీరూ తేలిపోయింది. దుర్మార్గులు పేద దాని రక్తం పీల్చుకున్నారు.

ఇక ఈమె ఏడ్పులూ రోదనలూ వారికి అనవసరం. మొబైల్ నిశ్శబ్దమైపోయింది. కొంత మంది కర్కశులు, మనుషులుగా జన్మించి కూడా అణువంత కరుణ లేకుండా ప్రజల పాలిట జలగలై జీవిస్తారు. అంత పెద్ద మోసం చేయడానికి ఎంత పెద్ద ముఠా తయారై ఉంటుందో కాస్త ఆలోచించండి!

"సోదర సోదరీమణులారా !
ఇది ఒక్క లీనాయే కాదు, ఈ కువైట్‌లో ఇంకెందరో అభాగ్యులు ఇలాగే మోసపోయి జీవచ్ఛవాల్లా జీవిస్తూ ఉండవచ్చు". ఈ ముప్పు ఒక కనువిప్పు. అల్లాహ్ సుబ్‌హానహూ వ తఆలా దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రకటించాడు:

"విశ్వాసులారా ! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం - ఇవన్నీ అసహ్యకరమైన షైతాన్ పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది."

(అల్ మాయిద: 90)

ఏదైనా ఒక క్రొత్త పని లేక తెలియని పని ప్రారంభించినప్పుడు ఇతరుల సలహా తీసికోవడం ఉత్తమం. అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

"(విశ్వసించి, తమ ప్రభువునే నమ్ముకున్న భక్తులు) తమ ప్రభువు ఆజ్ఞను శిరసావహిస్తారు. నమాజును నెలకొల్పుతారు. తమ వ్యవహారాలలో పరస్పరం సంప్రదించుకుని ఒక అవగాహనకు వస్తారు...."

(అష్ షూరా - 38)

పై సూక్తి ప్రకారం పరస్పరం సలహా తీసుకోవాలని ప్రేరేపించబడినది. సలహా తీసికునే వారి కార్యాలలో శ్రేయాన్ని, అల్లాహ్ సమృద్ధిని పొందు పరుస్తాడు. సలహా వల్ల మనం సత్యానికి దగ్గరౌతాము, ఇతరుల అభిప్రాయాలూ, అనుభవాల వెలుగులో మంచి నిర్ణయానికి వస్తాము. అంతే కాకుండా ప్రేమాభిమానాలు పెరుగుతాయి. సలహా, మనిషిని అహంభావం, పొగరుకు దూరంగా ఉంచుతుంది. సలహా తీసుకొనే వారికి ఎప్పుడూ అవమానం లేక వైఫల్యమనేది ఉండదు. సలహా చెడు పరిణామాలను అరికట్టుంది. కనుక సలహా సంప్రతింపులు చాలా అవసరం. లీనా కూడా ఒకవేళ ఎవర్నన్నా సంప్రదించి ఉంటే తను ఇలా మోసపోయి ఉండేది కాదు. (అల్లాహ్ ఆమెకు సహనమివ్వుగాక మరియు కష్టాలను దూరం చేయుగాక. ఆమీన్)

మానవ జన్మ చరితార్థం అవ్వాలంటే..?

సత్య ప్రియుల బలం పెరగాలి
అక్రమార్కుల అహం అణగాలి
శాంతి కాముకుల శ్రమ ఫలించాలి
కాంతి విద్రోహుల మదం తుంచాలి

స్వర్గం మన సొంతమవ్వాలంటే
సత్యార్తి రగలాలి, ధర్మ స్థాపన జరగాలి
నీలో నాలో మనందరిలో
స్నేహ వల్లి వెల్లి విరియాలి

కుట్రలు కుతంత్రాల పన్నొద్దు ఏ కులం పేరుతో
దమన నీతి, దహన కాండలు జరుపొద్దు మతం పేరుతో
నిఖిల జీవులంతా దైవ కుటుంబీకులనీ, దాసులనీ
పరస్పరం సోదరులుగా మసలుకోవాలనీ
మహాప్రవక్త ముహమ్మద్ (ﷺ) బోధించిన ప్రవచనాలు
ఇహపరాల సాఫల్య సాధనాలు మానవతను
వెలిగించే మణి దీపాలు హృదయ గీతాలు

ఎదుటివారిని ద్వేషించమని
ఏ బుద్ధుడూ బోధించడు
ఇరుకు బుద్ధులు పెంచుకోమని
ఏ రాముడూ ప్రవచించడు
అందరు శుభాత్మల సందేశం
ఏకేశ్వరోపాసనం, లోక కళ్యాణం
ఆ మాటయే దైవదర్శన భాగ్యాన్ని
అందించే సోపానం

తుపాకి తూటాలు, బాంబు పేలుళ్ళతో
నర రుధిరమే సాగించమని ఏ ఈసా చెప్పడు
జన ధన ప్రాణాలు, ప్రాణాధికమైన మానాలకు
నష్టం కలిగించమని ఏ మూసా అనడు
స్వార్థం కోసం సలిపే ప్రార్థన వ్యర్థం
దైవ ప్రసన్నత పిపాసతో సత్కార్యాలు
చేసే నరోత్తముల జీవితం చరితార్థం.



ద్వైతోపదేశం

అబూ అతీఖ్

ప్రవక్త (స) ప్రబోధనం

రహస్య సమాలోచన

"ఓ విశ్వాసులారా!
మీరు గనక (పరస్పరం) రహస్య సమాలోచన జరిపితే పాపం, అత్యాచారం, ప్రవక్త పట్ల అవిధేయత గురించిన సమాలోచన జరపకండి. దానికి బదులు సత్కార్యం, భయభక్తులకు సంబంధించిన సమాలోచన జరపండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. ఆయన వద్దకే మీరంతా సమీకరించబడతారు". (అల్ ముజాదలా -9)



తాత్పర్యం:

మదీనాలో యూదులు, కపటులు ఈ రకంగానే చెవులు కొరుక్కునేవారు. ముస్లింలను ఈ దురలవాటు నుంచి దూరంగా ఉంచే ఉద్దేశ్యంతో ఈ విధంగా తాకీదు చేయబడింది.

1) "ఓ ముస్లిములారా! మీరే గనక మీ విశ్వాసం (ఈమాన్) విషయంలో నిజాయితీ గలవారయితే ఇలాంటి పాపకార్యాలతో కూడిన మంతనాలకు, గుసగుసలకు దూరంగా ఉండండి" అని సావధాన పరచబడింది.

2) ఒకవేళ మీరెప్పుడైనా రహస్య సమాలోచన జరపవలసిన అవసరం అంతగా ఏర్పడితే అందులో పరోపకారం, శ్రేయోభిలాష, దైవభక్తి, దైవ ప్రవక్త (ﷺ) యెడల విధేయతా భావం తొణికిసలాడుతూ ఉండాలి. అపకార బుద్ధి ఏ కోశానా ఉండరాదు. సత్కార్యం, దైవ భీతి (తఖ్వా) అంటే ఇదే.

3) అపచారాన్ని, అవిధేయతను, అపరాధాలను ప్రేరేపించే 'రహస్య మంతనాలు' పైతాను తరఫుననే ఉంటాయి. దుష్ప్రేరణల ద్వారా విశ్వాసులను ఇరకాటంలో పెట్టాలన్నదే ఆ ధూర్తుడి ఉద్దేశం.

రహస్య మంతనాలు

హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (ర) కథనం ప్రకారం దైవ ప్రవక్త (ﷺ) ఇలా ఉపదేశించారు: "మీరు ముగ్గురు వ్యక్తులున్నప్పుడు - ఇద్దరు వ్యక్తులు ఏకమై, మూడో వానిని వేరు చేసి, రహస్య సమాలోచన చేయరాదు. అతను (మూడో వ్యక్తి) జన సమూహంలో కలిసిపోయిన తరువాత సమాలోచన జరుపుకుంటే అభ్యంతరం లేదు. ఎందుకంటే మీ (వేర్పాటు) ధోరణి అతణ్ణి దుఃఖానికి, మనస్తాపానికి లోను చేస్తుంది".

(బుఖారీ, ముస్లిం - వాక్యాలు ముస్లింలోనివి)



సారాంశం:

తోడుగా ఉన్న వ్యక్తిని ఉపేక్షించి ఇతరులతో గుసగుసలాడటాన్ని, రహస్య సమాలోచన జరపటాన్ని ఈ హదీసులో వారించటం జరిగింది. సాటి మనుషుల మనోభావాలు, భావోద్రేకాలను ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకుని వాటిని గౌరవించాలని, ఏ దశలోనూ మనోభావాలను గాయపరచరాదని కూడా ఈ హదీసు మనకు ఉపదేశిస్తుంది. ఈ ఉపదేశాల్ని లెక్క చేయకుండా తోటి మనిషిని వేరుపరిస్తే అతని మనస్సు చివుక్కుమంటుంది. వీళ్ళిద్దరూ కలిసి నన్ను పరాయివానిగా చూస్తున్నారేనన్న ఆలోచన అతనిలో వస్తుంది. బహుశా తనకు వ్యతిరేకంగా ఏదైనా కుట్ర పన్నుతున్నారేమోనన్న అనుమానం కూడా రావచ్చు. ఈ అనుమానాలే వ్యక్తుల మధ్య అంతరాల అగాథాలను సృష్టిస్తాయి. పరస్పర సహకార భావం బదులు సహాయ నిరాకరణ ధోరణి ప్రబలుతుంది. కాబట్టి సామూహిక జీవనంలో కొందరు కొందరిని వేరు చేసి, ఇంకొందరితో కలిసి రహస్య మంతనాలు సాగించటం, చెవులు కొరుక్కోవటం వారించబడింది. అయితే మూడో వ్యక్తి అక్కడ లేనపుడు ఇద్దరు కలిసి సమాలోచన సాగించటం మాత్రం తప్పు కాదు.



అనురాగ రావం

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

గుండెలోని ప్రాణం గొంతు దాటక ముందే....

శుభోదయం

ఏమంత బలాఢ్యుడు కాడు. చెప్పాలంటే ప్రకృతిలో అత్యంత బలహీనుడు - ఉత్త రెల్లు కర్ర వంటివాడు. అతని ఆహాన్ని అణచడానికి విశ్వమంతా ఎత్తి రానవసరం లేదు. ఒక చిన్న అగ్ని కణం చాలు - అతన్ని, అతని అహాన్ని అణచడానికి. ఆరాధనాలయంలో భక్తుడు, చెరసాలలో నేరస్థుడు, అవసరాల క్రూర హస్తాల మధ్య అజ్ఞాని, తన దైన్య స్థితికి - అణగారిన జీవితానికి మధ్య దరిద్రుడు, దురాశ - స్ఫురణల మధ్య ధనవంతుడు, సంధ్యా సమయంలో పొగమంచుకీ - జీవన ఉషోదయానికీ మధ్య సగటు మనిషి. ఒక్క మాటలో చెప్పాలంటే...మానవుని మనుగడ, మనిషి జీవితం కడలిపై తేలియాడే నురుగు లాంటిది. నీటి మీద క్షణం పాటు ప్రతక్ష్యమయ్యే బుడగ వంటిది. క్షణభంగురమది. గాలి వీస్తే గల్లంతే. మృత్యు వస్తే, అందరూ అంతే! దేహం లేని ఆత్మ ఉత్త శూన్యం. ఆత్మ లేని దేహం, అర్థం లేని చట్రం.

మదతలు పడిన ఆశలు, కలలు, వాంఛలు ముసలివాని ముఖ కవళికలు మాదిరిగా మారుతాయి. మనం మళ్ళీ చూసేటప్పటికి, అందు మన ముఖమే కనబడుతుంది. శీతాకాలంలో చెట్ల ఆకుల్లాగా 60, 80 సంవత్సరాలు మన జీవన వృక్షం నుంచి రాలి పోతాయి. అయితే భక్తిపరులకు జీవితం మృత్యువూ రెండూ సమానమే! కాదు, కాదు. వారికి జీవితం కన్నా మృత్యువే మనోహరం!! జీవితం పరీక్ష అయితే మృత్యువు పరమోన్నత మిత్రునికి చేరువ చేసే మహత్తర సాధనం. వారు మృత్యువును ప్రేమించినంతగా మరి దేన్నీ ప్రేమించరు. జీవితం మనిషిలోని కోర్కెలకు ఆజ్యం పోసినప్పుడు అది ఆశల ఆత్రాన్ని పెంచే, వెర్రితనాన్ని రెచ్చగొట్టే, దైవ అవిధేయతకు ఉసిగొల్పే చేష్టలే ఎక్కువగా చేస్తుంది. మృత్యువు మనిషిని అన్ని విధాల ద్రోహాల నుండి, ప్రాపంచిక వ్యామోహాల నుండి ఆపుతుంది. హద్దుల అతిక్రమణ, ఇహపరాల నాశనం చేసే హాలాహలమని, అహంకారం అనర్థదాయకం అని, బంధుత్వ విచ్ఛిన్నత భయంకర నేరమని, అవినీతి, అక్రమం, అన్యాయం శాశ్వత అంధకారమని హితవు చేస్తుంది. మరణం లేదు, రాదు అన్న భ్రమ కన్నా, మృత్యువు ఖచ్చితంగా వచ్చి తీరుతుంది అన్న వాస్తవమే మనిషిని అదుపులో ఉంచుతుంది. జీవితం మత్తుని కలిగిస్తుంది. మత్తెక్కించేలా వ్యవహరిస్తుంది.

మృత్యువు మత్తును వదలగొడుతుంది, మత్తెక్కకుండా కాపాడుతుంది. మనిషికి ఇన్ని మేళ్ళు చేసే ఆ మృత్యువు గురించి మహా ప్రవక్త (ﷺ) వారు ఏమన్నారో గమనించండి! "మజాలను హరించేదాన్ని, అంటే మృత్యువును ఎక్కువగా గుర్తు చేసుకుంటూ ఉండండి. ప్రజలారా! అల్లాహ్‌ను స్మరించండి. శరీరంలో దడ పుట్టించేది వచ్చేసింది. దాని తర్వాత వచ్చేది కూడా సమీపించింది. మృత్యువు తన భీతావహ రూపంలో వచ్చేసింది. తొందర చేయండి. ఏడు భయంకర దుస్థితులు దాపురించక మునుపే త్వరగా మంచి పనులు చేసుకోండి. ఏమిటి, మిమ్మల్ని (ధర్మం) మరిచిపోయేటట్లు చేసే పేదరికం, దారిద్ర్యం కోసం నిరీక్షిస్తున్నారా? లేక హద్దు మీరి ప్రవర్తించేటట్లు చేసే కలిమిని కోరుకుంటున్నారా? లేక మీ ఆరోగ్యాన్ని పాడు చేసే, మిమ్మల్ని చిందరవందర చేసే మహమ్మారి కోసం ఎదురు చూస్తున్నారా? లేదా బుద్ధిని, వివేకాన్ని చెడగొట్టే వృద్ధాప్యం కోసం వేచియున్నారా? లేక తృటిలో ప్రాణం తీసే మృత్యువు కోసం ఎదురు చూస్తున్నారా? లేక దజ్జాల్ రాక కోసం ఎదురు చూస్తున్నారా? అతడు అగోచరాల్లో అత్యంత చెడ్డవాడు. లేదా ప్రళయం కోసం ఎదురు చూస్తున్నారా? ప్రళయం అతి భయంకరమైనది, అత్యంత చేదైనది. మీరు మీ కోరికల్లో నిమగ్నులై ఉన్నంతలోనే అకస్మాత్తుగా మిమ్మల్ని కబళిస్తుంది. కాబట్టి మీరు ప్రపంచంలో ఓ అపరిచితునిలా, పరదేశీయునిలా, ఓ బాట సారిలా జీవించండి. (సాయంత్రమైతే తెల్లారే దాక వేచి చూడకండి. తెల్లారితే సాయంత్రం వరకు ఆగి ఉండకండి. ఆరోగ్యంగా ఉన్నప్పుడు అనారోగ్య పరిస్థితుల కోసం, మీ జీవితం లోంచి మరణానంతర జీవితం కోసం కావాల్సిన సామగ్రిని సమకూర్చుకోండి.

విశ్వసించిన జనులారా! మీ సిరిసంపదలూ, మీ సంతానమూ, మిమ్మల్ని అల్లాహ్ సంస్మరణ నుండి ఏమార్చరాదు. మీకు ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చు పెట్టండి. కర్మల వ్యవధి ముగిసిపోయిన వారికి ఇక వ్యవధి అంటూ ఇవ్వబడదు. "ఓ మా ప్రభూ! మా దౌర్భాగ్యం మమ్మల్ని కప్పేసింది. నిజంగానే మేము మార్గం తప్పినవారము. ఓ స్వామీ! ఇక మమ్మల్ని ఇక్కడ్నుంచి బయటకు తీయి. తరువాత మేము అలాంటి పాపాలు చేస్తే ఒట్టు" అని లెంపలేసుకునే దుస్థితి దాపురించక ముందే మంచి కార్యాలు చేపట్టండి. ప్రపంచం వెనక్కి మరలి (వీపు చూపించి) పారిపోతూంది. పరలోకం (ఆఘమేఘాల మీద) ముందుకు దూసుకు వస్తూంది. ఎవరికి ఏ భూభాగంపై మృత్యువు రానున్నదో ఏ వ్యక్తికీ తెలియదు. ఆ ఘడియ ఆసన్నమైనప్పుడు ఒక్క నిమిషం కూడా వెనకా ముందూ కాజాలదు. సత్కార్యాలు చేయండి. సజ్జనుల సాంగత్యాన్ని ఆశ్రయించండి. నరకాగ్ని నుండి కాపాడబడి స్వర్గంలో ప్రవేశ పెట్టబడేవారు మాత్రమే నిజానికి సఫలీకృతులన్న సంగతిని మరువ కండి.

(మృత్యువు మనోహరమైనదే) కాని, మీలో ఏ ఒక్కరూ (కావాలని) చావుని కోరుకోరాదు. మీరు మంచివారైతే (జీవించి ఉంటే) మరిన్ని మంచి పనులు చేసుకోవచ్చు. మీరు చెడ్డవారైతే చేసిన నిర్వాకంపై (ముస్మందు) పశ్చాత్తాపం చెందవచ్చు! కాబట్టి మీలో ఎవరు కూడా తనకేదయినా నష్టం కలిగినప్పుడు చావుని కోరుకోరాదు. గత్యంతరం లేదనుకుంటే, ఖచ్చితంగా చావే కావాలనుకుంటే "అల్లాహుమ్మ అహ్‌యినీ మా కానతిల్ హయాతు ఖైరన్‌లీ, వ తవఫ్ఫనీ ఇజా కానతిల్ వఫాతు ఖైరన్‌లీ". (ఓ అల్లాహ్! జీవితం నా పాలిట ప్రయోజన కరమైనంత వరకు నన్ను సజీవంగా ఉంచు. ఒకవేళ మరణమే నా కోసం మేలయితే అప్పుడు నాకు మరణాన్ని ప్రసాదించు) అని ప్రార్థిస్తూ ఉండండి.

భోజనం చేస్తూ సలాంకు జవాబివ్వటం

ప్రశ్న: భోంచేస్తూ మధ్యలో సలాం చేయవచ్చా? ఆ సమయంలో ఎవరైనా సలాం చేస్తే, దానికి జవాబు ఇవ్వచ్చా?

(సయ్యిద్ ఇన్తెజార్ – కువైట్)

జవాబు: సలాం చేయవచ్చు. సలాంకు జవాబు ఇవ్వవచ్చు. ఇందులో 'వారింపు' ఏదీ లేదు. "అన్నం తినేటప్పుడు మాటామంతీ-సలాం జవాబు తగదు" అనేది సర్వత్రా ప్రసిద్ధి చెందిన సంగతి నిజమే. కాని ఆ మేరకు హదీసుగానీ, ప్రామాణిక ఆధారంగానీ ఏదీ లేదు. మహా ప్రవక్త (ﷺ) భోజన సమయంలో మాట్లాడిన దాఖలాలు ఉన్నాయి. ఒకసారి ఆయన (ﷺ) సమక్షంలో మాంసం ఒడ్డించబడింది. దాన్ని ఆయన తింటూ "నేను ప్రళయ దినాన జనులకు నేతృత్వం వహిస్తాను" అన్నారు. ఆ తరువాత ఆయన (ﷺ) 'సిఫారసు'కు సంబంధించిన సుదీర్ఘమైన హదీసు కూడా వినిపించారు. (బుఖారీ, ముస్లిం)

కొంత మంది ధర్మవేత్తలు భోజన సమయంలో సలాం చేయటాన్ని వారించారంటే, నోటిలో అన్నం ముద్ద ఉన్నప్పుడు మాట్లాడటం వల్ల ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో అలా చెప్పి ఉంటారు. ఒకవేళ ఆ క్షణంలో ఎవరయినా సలాం చేస్తే తక్షణం జవాబు ఇవ్వాల్సిన అవసరం లేదు.

ఇస్లాం స్వీకరణకు ఖత్నా చేసుకోవడం అవశ్యమా?

ప్రశ్న: ఇస్లాం ధర్మంలోనికి రావాలంటే ఖత్నా (సున్నతి) చేసుకోవటం తప్పనిసరా? ఇంతకీ ఖత్నా (సుంతీ) వల్ల కలిగే లాభం ఏమిటి?

(జహాంగీర్ ఆలమ్ – కువైట్)

జవాబు: తప్పనిసరి ఏమీ కాదు. ఎవరయినా ఒక వ్యక్తి మనస్ఫూర్తిగా ఇస్లాం ధర్మం గ్రహించడానికి ముందుకు వస్తే, అతని చేత సాక్ష్య వచనం (కలిమయె షహాదత్) పలికిస్తే సరిపోతుంది. ఇస్లాం స్వీకారానికి – ఖత్నా (సుంతీ) చేయించుకోవటానికి మధ్య అవినాభావ సంబంధం ఏమీ లేదు. ఎవరైనా చేయించుకుంటే మంచిదే. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల ఖత్నా చేయించుకోకపోయినంత మాత్రాన అతను పాటించే నమాజులోగానీ, వేరితర సత్క్రియల్లోగానీ ఎలాంటి దోషం ఏర్పడదు.

ఇస్లాం ఒక ప్రకృతి ధర్మం. ఖత్నా (సుంతీ) చేయించుకోవటం ప్రాకృతిక సత్సంప్రదాయం (సున్నత్). కాబట్టి తన అనుయాయులకు ఖత్నా చేయించుకోమని ఇస్లాం తాకీదు చేసిన సంగతి నిజమేగాని అవశ్యంగా ఖరారు చేయలేదు.

ఆరోగ్య రీత్యా కూడా ఖత్నా చేయించుకోవడం మంచిది. ఖత్నా చేయించుకున్న వారు సుఖ వ్యాధుల నుండి, ఎయిడ్స్, కేన్సర్ వంటి ప్రాణాంతక రోగాల నుండి చాలావరకు సురక్షితంగా ఉండగలరని పరిశోధనల్లో తేలింది.



నిద్రించే సమయంలో శ్రీమతిని తలచుకోవటం

ప్రశ్న: ఒక వ్యక్తి నిద్రకు ఉపక్రమిస్తూ, భార్యను గురించి ఆలోచించుకోవటంలో, భావ ప్రాప్తికై భార్యను ఆశించటంలో తప్పేమన్నా ఉందా? (ముహమ్మద్ అలీ – కువైట్)

జవాబు: తప్పు లేదు. అలా చేయటం సమ్మతమే. నిద్రపోయే టప్పుడైనా, వేరితర సమయాల్లోనయినా అర్ధాంగిని గురించి ఆలోచించుకోవటం ఆక్షేపణీయం కాదు. ఆక్షేపణీయమల్లా పరాయి స్త్రీని తలచుకుని భావప్రాప్తి పొందటమే. కడకు శ్రీమతికి ఏకాంతంలో ఫోన్ చేసి సరస సల్లాపాలు జరపవచ్చని కూడా విద్వాంసులు అభిప్రాయపడ్డారు. కాకపోతే ఆ విధంగా ముచ్చటించిన తరువాత ఆ దంపతులు తమ తమ స్థానాల్లో కామోద్రేకంతో ఎలాంటి అక్రమ చేష్టకు ఒడిగట్టకుండా, నిగ్రహంతో వ్యవహరించాలన్నది షరతు.

రెండో పెళ్ళికి అర్ధాంగి అనుమతి

ప్రశ్న: రెండో పెళ్ళి చేసుకోవటానికి మొదటి భార్య అనుమతి పొందటం అవసరమా? (సలీం పర్వేజ్ – కువైట్)

జవాబు: రెండో పెళ్ళి చేసుకోదలచిన వ్యక్తి తన మొదటి భార్య అనుమతిని పొందవలసిన అవసరమైతే లేదు. ఇక్కడ చూడవలసిన అతి ముఖ్యమైన విషయం పురుషుడు మరో పెళ్ళి ఎందుకు చేసుకుంటున్నాడన్నదే. ఒకవేళ అతను గనక రెండో పెళ్ళికి అర్హుడై ఉండి, ఇద్దరు భార్యల మధ్య 'న్యాయం' చేయగల శక్తిస్థోమతలు కలిగి ఉంటే సరి – ఒకవేళ ఈ రెండో పెళ్ళికి మొదటి భార్య అంగీకరించకపోయినా సరే. కాని భార్యల మధ్య న్యాయం చేయలేనన్న అనుమానం ఉంటే మాత్రం ఒక్కావిడతో సరిపెట్టుకోవడమే సమంజసం. "ఒకవేళ న్యాయం చేయలేమన్న భయం మీకుంటే ఒకామెతోనే సరిపెట్టుకోండి". (అన్నిసా: 3)

అయితే భార్యకు దూరంగా – విదేశాల్లో ఉంటున్న భర్త మాత్రం రెండో పెళ్ళి చేసుకోదలచుకుంటే తప్పకుండా మొదటి భార్యను సంప్రతించి, ఆమె అంగీకారం పొందటం మంచిది. అన్యథా ఆ కాపురంలో కలతలు రేగి అన్యోన్నత దెబ్బ తింటుంది.



హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్

ఇస్లాం శిక్షణ

ప్రార్థన (దుఆ)



ఆ శాశ్వతమైన ఈ లోకంలో దేవుడు కష్టం, సుఖం, అదృష్టం, దుర దృష్టం, మిత్రులు శత్రువులు, ఆరోగ్యం, అనారోగ్యం లాంటి సుఖదుఃఖాలెన్నింవిరినో సృష్టించాడు. మనిషి తను పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు తరచూ ఇలాంటి వాటికి గురవుతూనే ఉంటాడు. అయితే దేవుడు వాటితోపాటు వాటి నుండి రక్షణ పొందటానికి ఎన్నో పద్ధతులు, ముందు జాగ్రత్తలు కూడా సూచించాడు. వాటిని ఆచరించి మనిషి తన్ను తాను కష్టాల నుండి రక్షించుకోగలడు. మానవులు రోగాలను నయం చేసుకోవటానికి ప్రార్థనలను, మందులను కూడా దేవుడు పుట్టించాడు. అందుకే దైవప్రవక్త (ﷺ) ఒకానొక సందర్భంగా "దేవుడు ప్రతి వ్యాధికీ చికిత్సను, ఔషధాలను పుట్టించాడు" అని అన్నారు. (బుఖారీ)

దుఆలను అల్లాహ్ మాత్రమే ఆలకిస్తాడు

వాస్తవానికి మానవుల్ని దుఃఖవిచారాలకు, కష్టాలు కడగండ్లకు గురి చేసేవాడూ, తిరిగి వాటి నుండి కాపాడి వారికి సౌఖ్యాన్నీ, ఆరోగ్యాన్ని ప్రసాదించేవాడు కూడా దేవుడే! సృష్టిలోని ప్రతి వస్తువుపై ఆయనకు తిరుగులేని ఆధిపత్యం ఉంది. అయితే ఈ కష్టాలు, కడగండ్లకు గురైనప్పుడు తనను మొరపెట్టుకునే వారిని ఆయన అమితంగా ప్రేమిస్తాడు. ఆ విధంగా మొరపెట్టుకోవటాన్నే 'దుఆ' అని అంటారు.

"బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు అతని మొరను ఆలకించి, అతని బాధను దూరం చేసేవాడు ఎవడు?" (ఖుర్ఆన్- 27: 62)

పుట్టుక రీత్యా మనిషి అవసరాలు, అక్కరలు కలవాడు. సహజంగానే అతనికి అవసరాలు ఏర్పడుతుంటాయి. అల్లాహ్ మాత్రమే సర్వ సంపన్నుడు, నిరపేక్షాపరుడు. ఆయన ఇలా అంటున్నాడు:

"మానవులారా! మీరందరూ అల్లాహ్ అవసరం కలవారే. కాని అల్లాహ్ మాత్రం సర్వ సంపన్నుడు, స్వయంగానే స్తుతిపాత్రుడు".

(ఖుర్ఆన్ - 35: 15)

అల్లాహ్‌ను తప్ప ఇతరులను ప్రార్థించరాదు

మనిషి సహజంగా అవసరాలు కలవాడు అవడం చేత దుఆ తప్ప అతనికి గత్యంతరం లేదు. దుఆ మనిషికి నిత్యావసరం. మానవులు సాటి మానవుల్ని మొరపెట్టుకోవటం ప్రకృతి విరుద్ధమైన పని. స్వయంగా నిస్సహాయుడైన మానవుడు సాటి మానవుల నిస్సహాయతను దూరం చేయలేడు. అల్లాహ్‌ను వదలి పెట్టి ఇతర సజీవినిగాని, నిర్జీవినిగాని మొరపెట్టుకోవటం ఎంత తెలివి తక్కువ పనంటే అలా చేసేవాడు నీళ్ళ ముందు నిలబడి "వచ్చెయ్యి! నా నోట్లోకి వచ్చెయ్యి" అని నీళ్ళను పిలిచే మూర్ఖుడితో సమానం.

(13: 14).

విశ్వ సామ్రాజ్యాధిపతి అయిన అల్లాహ్‌ను త్రోసిరాజని సజీవ లేక నిర్జీవ సృష్టిరాసుల్ని మొరపెట్టుకునేవారు ఎంత అవివేకులు?! కొందరయితే కదలలేని, మెదలలేని, కనులు విప్పి చూడలేని, పెదవి విప్పి పలకలేని రాళ్ళను తమ ఆరాధ్య దైవాలుగా చేసుకొని వాటిని తమ కష్టాల గురించి మొర పెట్టుకుంటుంటారు. ఈ వైఖరి మరీ దారుణం!

సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొలువు తీర్చి, "నన్ను మొరపెట్టుకోండి. నేను మీ మొరలను ఆలకిస్తాను" అని ప్రకటిస్తూ ఉంటే, మరోవైపు ఆయన దాసులు ఆయన్ని వదలిపెట్టి ఇతర మిథ్యా దైవాల ముందు చేయి చాపటం ఎంత దిగజారుడుతనం?! ఒక ముస్లిం అలాంటి ఘాతుకానికి ఒడిగడితే అది ఇంకా శోచనీయమైన విషయం!

'దుఆ' కూడా ఒక ఆరాధన లాంటిది. ఆరాధనలన్నీ అల్లాహ్‌కే చెల్లుతాయి. అల్లాహ్‌ను వదలి ఇతరుల్ని మొరపెట్టుకోవటం, వారిని సహాయం చేయమని అర్థించటం, వారిని ఆపద మ్రొక్కువారిగా తలపోయటం "షిర్కె జలీ" (బహిరంగ బహుదైవారాధన) అవుతుంది. దేవుడు దాన్ని ఎన్నటికీ మించడు.

విశ్వాసి చేతిలో 'దుఆ' ఆయుధం వంటిది. దాని ముందు పెద్ద పెద్ద ఆయుధాలు కూడా పనికిరాకుండా పోతాయి. హృదయావేదనకు ఉపశమనం, బాధితులకు ఆధారం, భయాందోళనలకు గురయిన వారికి అభయ హస్తం దుఆ!

బాధితుని శాపం సప్తాకాశాలనూ చీల్చుకుని వెళుతుంది

బాధితుని నోటి నుండి వెలువడే దుఆ అంతరిక్షాన్ని, సప్తాకాశాలనూ చీల్చుకుంటూ దైవ సన్నిధికి వెళ్ళి బాధితునికి సహాయం అందేలా చేస్తుంది.

దుఆ ఎన్నడూ త్రోసిపుచ్చబడదు!

దాసుడు చేసే దుఆ ఎట్టి పరిస్థితిలోనూ త్రోసిపుచ్చబడదు. దాసుని దుఆ ఒక్కోసారి వెంటనే దైవ సన్నిధిలో స్వీకృతికి నోచుకుంటుంది. లేదా దాని మూలంగా అతనికి రాబోయే ఆపదలు, గండాలు తప్పి పోతాయి. లేదా ఆ దుఆ అతని పరలోక జీవితం కొరకు నిక్షేపంగా ఉంచబడుతుంది.

మానవతా ప్రవక్త

శాంతి ప్రియ

లోక కళ్యాణార్థం వేల సంఖ్యలో
వచ్చిన ప్రవక్తల వలె ఆవిర్భవించె
మళ్ళీ ఒక కరుణ కలువ
విరబూసింది మానవ వసంతాన

ఆయన దేశకాలాలకు పరిమితమైన
ప్రవక్త కాదు, వినిర్మల హృదయ
విశ్వనాయకుడు అచ్చమైన
అక్షరాల అంతిమ దైవ ప్రవక్త (ﷺ)

ఆయన పలుకులలో తేనెలొలికెను
అంతఃకుహరాల తమస్సులు తొలిగెను
తపశ్శక్తులై ఉషస్సోతులై వెలిగెను
మతుల మైల కడిగి మానవత్వం
నాటెను ఆయన దయా దృష్టి వీక్షణల
దివ్యత్వము కాపురముండెను

రుధిర పిపాస వెర్రి తలలు వేసిన
మృగ సమాజ మతోన్మాదులు ఆయన
పలుకుల స్వాతిముత్య చినుకుల తాకిడిచె
మానవ ముత్యాలైపోయిరి

బహు విచిత్రమాయన హితోక్తి
వినగానే ధరాపతులు ధనాన్వితులు
దళిత నిరుపేదల్ని గుండెలకు హత్తుకొనిరి
'సయ్యిదీ' అంటూ గౌరవించిరి

గుండెకాయని నమిలి మింగలేక
ఉమ్మేసినట్టి వారిని చేరదీసి నిజం
ఇదని నచ్చజెప్పి మెలమెల్లగా మనిషిగా
మలచిన నీవు ముమ్మాటికీ మహా మనీషివే!

కర్కశ హృదయాల్లో కరుణ రసాల్ని పండించి
కుఫ్ర్ కారడవిని ఈమాన్ కాంతి వనంగా
మలచి మమతల ముత్యాలు జల్లిన
నీవు నిస్సందేహంగా జగద్గురువువే

నెత్తురు వొడిన నేలలో నీతి
అత్తరులను చిల్కించితివె
సతులు చితికి ఆహుతయ్యే భూమిలో
తల్లి పాదాల చెంత స్వర్గమంటివె

ఈ జగాన జీవించిన నీవు
మాన్యుడవు అసామాన్యుడవు
భౌతిక జీవితం పరలోక పంట
పొలం అన్న మహిమాన్వితుడవు

మనిషికీ - అభిమతానికి మధ్య జరిగిన
భీకర పోరులో కులానికి కాదు
గుణానికే దిగ్విజయమ్మని
చాటిన ధర్మప్రభాకరుడవు

ముహమ్మద్ ఖాన్ (గన్నవరం)

పీస్ ఆఫ్ మైండ్

పీస్ ఆఫ్ మైండ్ అన్న పదం
నా దృష్టిలో మనిషికి వర్తించదు
వర్తించకూడదు కూడా!

మానసిక ప్రశాంతత అనగా
పండయి రాలే చివరి దశని
నా అనుభవంలో రుజువైన పదం!
నిజం చెప్పాలంటే
ఎంత చెట్టుకు అంత గాలి, అన్నట్లు
ఎంత మనిషికి అంత బాధ్యత

ప్రశాంతంగా
నిదురించే మనిషి ఎవడున్నాడు?
గాలికి ఊగని చెట్టు ఏది?

నేనొక సముద్రాన్ని మోస్తున్నా!
నీవొక నదిని మోస్తున్నావు!
అతనొక జలపాతాన్ని మోస్తున్నాడు!
అల్లతనేమో చినుకును మోస్తున్నాడు!
నెత్తినేమీ లేకుండా
ఒట్టి చేతుల్తో నడుస్తున్నవారెవరు?

వయసును బట్టి
అతని పరిధిని బట్టి, శక్తిని బట్టి
అతను నివసిస్తున్న పరిసరాల్ని బట్టి
ఎంతో కొంత బరువును
దింపుకుంటూనో ఎత్తుకుంటూనో
మోస్తూనో తిరగక తప్పదు!

పుట్టినప్పటి నుండి పోయే వరకు
దారి పొడవునా
అతని పాద ముద్రలు, తథ్యం

"ఓ మానవుడా! నీవు భారంగా, బలవంతంగా నీ ప్రభువు వైపునకు సాగిపోతున్నావు. ఆయనను కలుసుకోబోతున్నావు".

(దివ్య ఖుర్ఆన్- 84: 6)





షేఖ్ ముహమ్మద్ బిలాల్

ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూ బకర్ (ర)

విశ్వాసులకు – అవిశ్వాసులకు జరిగిన మొదటి యుద్ధం (బదర్) లో విజయానంతరం బందీలుగా చిక్కినవారి విషయంలో వీరు మన సోదరులే, పరిహారం తీసుకొని వదిలి వెయ్యాల్సిందిగా మహోన్నతమైన సలహా ఇచ్చి అబూ బకర్ (ర) తన హుందాతనాన్ని చాటుకొని ప్రవక్త స) హృదయాన్ని దోచుకున్నారు. హిజ్రీ శకం 9 వ సంవత్సరం రోమన్లతో జరిగే యుద్ధం కోసం విరాళాల కోసం ప్రవక్త (స) గారు ప్రకటన గావించగా అబూ బకర్ (ర)గారు ఇంట్లో ఉన్నదంతా ఊడ్చుకొని మరీ తెచ్చిచ్చారు. ఇంటివారల కోసం అల్లాహ్‌ను, దైవప్రవక్తను వదిలిపెట్టాను అని చెప్పి ప్రగాఢమైన విశ్వాసాన్ని చాటుకొన్నారు.

ప్రవక్త (స) గారు నమాజు చేయించలేనంతగా వ్యాధిగ్రస్తులై పోవడంవల్ల తన స్థానంలో అబూ బకర్ (ర) గారిని ఇమాముగా నియమించారు. స్వయంగా ప్రవక్త (స) గారు కూడా కలిసి నమాజు చేశారు. ప్రవక్త (స) చనిపోయిన తర్వాత అబూ బకర్ (ర) గారిని ఖలీఫాగా ఎన్నుకోవడం జరిగింది. మేధావులు ఎంతగానో నచ్చజెప్పిన తర్వాత ఆయన ఈ బాధ్యతను స్వీకరించారు. తను చేస్తున్న వ్యాపారాన్ని మానేసి పూర్తి సమయాన్ని ఖిలాఫత్ బాధ్యతలను ఏకాగ్రతతో నిర్వహించడానికి వెచ్చించారు.

హజ్రత్ అబూ బకర్ (ర) గారు ఖలీఫా అయిన తర్వాత కొన్ని తెగలు తిరుగుబాటు చేశాయి. వాటిని ఆయన సమర్థవంతంగా అణచివేశారు. అంత కష్ట కాలంలో కూడా ఆయన సైన్యానికి నీతిబోధనలు చేశారు.

వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

1. నిజాయితీగా వ్యవహరించండి. 2. చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోండి. 3. యుద్ధంలో హతులయినవారి అవయవాలు కోసెయ్యకండి, స్త్రీలను, పిల్లలను, వృద్ధులను చంపకండి. 4. ఖర్జూరపు చెట్లను నరకడంగాని, కాల్చడంగాని చెయ్యకండి. 5. దొంగతనానికి పాల్పడకండి. 6. మేకలు, గొర్రెలు, ఆవులు, ఒంటెలను తినడానికి తప్ప చంపకండి. 7. చర్చీలలో ఉండి ఆరాధనల్లో నిమగ్నులై ఉండే వారి జోలికి పోకండి. 8. మీకెవరైనా భోజనం పెడ్తె మీరు అల్లాహ్ పేరు ఉచ్చరించి తినండి.

హజ్రత్ అబూ బకర్ (ర) ఖిలాఫత్ కాలంలోనే (రాతి ఫలకలు, చర్మపు ముక్కలు, ఖరూరపు మట్టలు, ఎముకలపై వ్రాయబడిన) ఖుర్‌ఆన్ భాగాలను ఒక చోట జమచేసి సమగ్ర గ్రంథంగా రూపొందించటం జరిగింది.

హిజ్రీ శకం 13 వ సంవత్సరం, జమాదిల్ ఆఖిర్ నెలలో హజ్రత్ అబూ బకర్ (ర) జబ్బు పడ్డారు. ఆయన కోరిక ప్రకారమే ప్రవక్త (స) గారి మరణం లాంటి మరణాన్నే అల్లాహ్ ప్రసాదించాడు. ప్రవక్త (స) గారు పరమపదించే నాటికి 63 సంవత్సరాలు, హజ్రత్ అబూ బకర్ (ర) గారికి కూడా 63 సంవత్సరాలు. ప్రవక్త (స) గారు సోమవారం చనిపోయారు. హజ్రత్ అబూ బకర్ (రజి) గారు కూడా సోమవారం (మగ్రిబ్, ఇషా మధ్యలో) చనిపోయారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.

అబూ బకర్ (రజి) గారి భార్యలు:

హజ్రత్ అబూ బకర్ (ర) నలుగురు స్త్రీలను వివాహమాడారు.

(1) ఖతీలా బిన్త్ అబ్దుజ్జా: ఈమె లూయా తెగకు చెందిన మహిళ. ఇస్లాం స్వీకరణకు పూర్వమే ఈమెను వివాహమాడారు.

(2) ఉమ్మె రూమాన్ బిన్త్ ఆమిర్: ఈమె బనీ కనానా వంశానికి చెందిన మహిళ. ఈమెను కూడా ఇస్లాం స్వీకరణకు పూర్వమే వివాహమాడారు.

(3) అస్మా బిన్త్ ఉమైస్ (ర): ఈమె ఖషామ్ వంశానికి చెందిన మహిళ. ముస్లిం అయిన తర్వాత ఈమెను వివాహమాడారు. మొదట ఈమె వివాహం హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్‌తో అయింది. హజ్రత్ జాఫర్ (ర) అమరగతులయిన తర్వాత ఆమెను హజ్రత్ అబూ బకర్ (రజి) వివాహమాడారు.

(4) హబీబా బిన్త్ ఖారిజా (ర): ఈమె ఖజ్రజ్ తెగకు చెందిన మహిళ. ఈమెను కూడా ముస్లిం అయిన తర్వాతే వివాహమాడారు.



ముస్లింల ప్రథమ ఖలీఫా అబూ బకర్ (రజి) ముందు, ఆయన బానిస తినటానికి ఒక పదార్థం సమర్పించాడు. అబూ బకర్ (రజి) దాని గురించి విచారించకుండానే ఆరగించారు. కాని తను భుజించిన పదార్థం అక్రమంగా ఆర్జించబడిందని తరువాత ఆయనకు తెలిసింది. వెంటనే నోటిలో వ్రేళ్ళు వేసి అతి కష్టం మీద తిన్నదంతా కక్కేశారు. ఈ వైనాన్ని చూసిన ఒకరు, 'చిన్న పదార్థం తిన్నంత మాత్రానికే ఇంతగా ఆందోళన ఎందుకని ప్రశ్నించగా, "మానవుని శరీరంలోని ఏ భాగం అక్రమ సంపాదనతో ఎదుగుతుందో అది నరకాగ్నికి ఆహుతి అవుతుందని ప్రవక్త (స) వారు చెబుతుండగా నేను విన్నాను. ఈ పదార్థం వల్ల నా శరీరంలో ఒక్క చుక్క రక్తమయినా తయారయిందంటే నేను నరకానికి వెళ్ళాల్సి వస్తుందని భయపడి ఇలా చేశాను"ని జవాబిచ్చారు.



సంతానం:

మొదటి భార్య ద్వారా హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి), హజ్రత్ అస్మా (రజి) పుట్టారు.

(1) అబ్దుల్లాహ్ (రజి): ఈయన ప్రారంభంలోనే ఇస్లాం స్వీకరించారు. తాయిఫ్ యుద్ధంలో దైవప్రవక్త (స)తోపాటు పాల్గొన్నారు. హజ్రత్ అబూ బకర్ (రజి) పాలనా కాలంలోనే ఈయన చనిపోయారు.

(2) హజ్రత్ అస్మా (రజి): ఈమె సౌర్ గుహలో దైవప్రవక్త (స) కు సేవ చేశారు. ప్రవక్త (స) గారు ఆమెను **'జాతున్ నితాఖైన్'** అని ముద్దుగా పిలిచారు. హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)తో వివాహం జరిగింది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) ఈమె కుమారులే. ఆమె వంద సంవత్సరాలు జీవించారు.

రెండవ భార్య ద్వారా హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి), విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) గారు జన్మించారు.

(1) అబ్దుర్రహ్మాన్ (రజి): ఈయన చాలా కాలం తర్వాత ఇస్లాం స్వీకరించారు. నాన్నగారి పరిపాలనా కాలంలో అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రీ శకం 53లో చనిపోయారు.

(2) ఆయిషా (రజి): ఈమె వివాహం దైవప్రవక్త (స)తో జరిగింది. ఈమె ఎంతో తెలివితేటలు గల మహిళ. హదీసు విద్యలో గొప్ప పండితురాలు. దాదాపు 70 సంవత్సరాల వయసులో హిజ్రీ శకం 58లో పరమపదించారు.

మూడవ భార్య ద్వారా హజ్రత్ ముహమ్మద్ బిన్ అబూ బకర్ (రజి) పుట్టారు. హజ్రత్ అలీ (రజి) పాలనా కాలంలో ఈజిప్ట్ గవర్నరుగా పని చేశారు. ఈజిప్ట్‌లోనే చనిపోయారు.

నాల్గవ భార్య ద్వారా ఉమ్మె కుల్సూమ్ (రహ్మలై) జన్మించారు. ఈమె హజ్రత్ అబూ బకర్ (రజి) గారు చనిపోయిన తర్వాత జన్మించారు.

రూపు రేఖలు, గుణగణాలు:

హజ్రత్ అబూ బకర్ (రజి) తెల్లగా, బక్క పలచగా ఉండేవారు. బుగ్గలు సొట్టబోయి ఉండేవి. కళ్ళు కొంచెం లోపలికి ఉండేవి. బట్ట తల. గడ్డానికి గోరింటాకు పూసుకొనేవారు. కొంచెం వంగి నడిచేవారు. చేతి వ్రేలికి వెండి వుంగరం ఉండేది.

హజ్రత్ అబూ బకర్ (రజి) ఉదార స్వభావి, అధికంగా దానధర్మాలు చేసేవారు, పేదల పెన్నిధి, మృదు హృదయులు, దివ్య ఖుర్‌ఆన్‌ను పఠిస్తూ దు:ఖించేవారు. ఆయన ఎంతో ధైర్యశాలి, పరాక్రమవంతుడు. ఎక్కువగా అల్లాహ్‌కు భయపడేవారు, భక్తి పరులు. రాత్రిళ్ళలో ఆరాధనలలో గడిపేవారు, పగటి వేళల్లో ఉపవాసాలు పాటిస్తుండేవారు. సంఘసేవ కోసం ముందుండే వారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రవక్త (స)ను చాలా వరకు అనుకరించేవారు. దైవభీతి పారాయణత, ధనవ్యయంలో జాగ్రత్తలు, అధర్మ సంపాదనకు దూరం, నోటి దురుసు పట్ల జాగ్రత్త, సహచరుల పట్ల సద్వర్తనం, నిగర్వి, నిరాడంబరత ఆయనగారి గుణగణాలకు దర్పణం. ప్రజాసేవ, అతిథి సత్కారంలో అందెవేసిన చెయ్యి. కలల గూడార్థం చెప్పేవారు. ఏ పుణ్యకార్యమూ వదిలే వారు కాదు.

ప్రపంచ మానవాళికి ఆయన చేసిన హితోక్తులు:

(1) దేవుని ప్రియ భక్తులయినవారు సిరిసంపదలన్నింటినీ దేవుని మార్గంలో ధారపోయాలి.
(2) ఇతరులపై నిందారోపణ చేయకండి, మీకు మనశ్శాంతి లభిస్తుంది.
(3) చెడ్డ పనులు చేసేవారికి తోడ్పడేవారు కూడా చెడ్డ పనులు చేస్తున్నట్లే.
(4) సత్కార్యాలు మనిషిని దుష్కార్యాల నుండి కాపాడుతాయి.
(5) మీ వల్ల ఏదైనా పాపకార్యాలు జరిగి ఉంటే వాటికి బదులుగా పుణ్యకార్యాలు చేసి మిమ్మల్ని మీరు దైవశిక్ష నుండి కాపాడుకోండి.
(6) చెడ్డ స్నేహితులతో కలిసి ఉండడం కన్నా మీరు ఒంటరిగా ఉండడమే మంచిది.
(7) పాపం చీకటి లాంటిది. దాన్ని దైవభీతి మాత్రమే తొలగిస్తుంది.
(8) పరలోకం కూడా చీకటి లాంటిది. దాన్ని సదాచరణ అనే వెలుగు పోగొడ్తుంది.
(9) మనసు లగ్నం చేసి చేసే నమాజే అసలైన నమాజు.
(10) జ్ఞానం అనేది దైవప్రవక్తల నుండి వారసత్వంలో లభించే సంపద.
(11) ఆపదను సహనం ద్వారా దూరం చేయవచ్చు.
(12) ఉదయం పెందలాడ లేవడంలో మీరు వక్షుల వెనుక ఉండి పోవడం ఎంతో సిగ్గుచేటయిన విషయం.
(13) మీరు గౌరవించబడాలంటే ఇతరులకు అతిథి మర్యాదలు చేయండి.
(14) పదవీ హోదాల ప్రలోభానికి గురి కాకుండా ఉంటే పేరు ప్రతిష్టలు మీ పాదాలను తాకుతాయి.
(15) మూడు విషయాలు మనిషికి ప్రాణ సంకటంగా మారుతాయి అవి: అన్యాయం, వాగ్దాన భంగం, మోసం.

ఆహా... అబ్దుల్ అజీమ్!

అజీజుర్రహ్మాన్



కడప ఇస్లామిక్ సొసైటీ (కడప) అధ్వర్యంలో 20 ఏండ్లుగా ధర్మ సేవకునిగా పనిచేస్తున్న జనాబ్ అబ్దుల్ అజీమ్ దైవ సన్నిధికి చేరుకున్నారని తెలియజేయటానికి విచారిస్తున్నాము... ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్...

జనాబ్ అబ్దుల్ అజీమ్ కడప జిల్లా వాస్తవ్యులు. 21 సంవత్సరాల క్రితం ఆయన కువైట్‌లో ఇస్లాం స్వీకరించారు. ఇస్లాం స్వీకారం తరువాత ఆయన ఎన్ని కష్టాలెదురైనా, ఏ మాత్రం తొణకకుండా చెక్కు చెదరని సహన స్థయిర్యాలను చూపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడున్నాడు.

మర్హూమ్ అబ్దుల్ అజీమ్ మంచి వక్త. ఆకాశవాణి, కడప కేంద్రం నుండి ఆయన గారి ధార్మిక ప్రసంగాలు ప్రసారమయ్యేవి. తరచూ కడపలోని జైలుకెళ్ళి ఖైదీల దిద్దుబాటుకు యత్నించేవారు. కడప సొసైటీ ఆధ్వర్యంలో జరిగే సభలు, సమావేశాలలో ప్రసంగించేవారు. పెద్ద స్థాయిలో ఇస్లామీయ సాహిత్యాన్ని, పత్రికలను సర్క్యులేట్ చేసేవారు. దావా విభాగంలో శిక్షణ పొందేందుకు ఆయన రెండేళ్ళ పాటు ఉమ్రాబాద్ జామియా దారుస్సలామ్‌లో కూడా ఉన్నారు. అబ్దుల్ అజీమ్ గారి అవిశ్రాంత పోరాటంలో మనందరికీ ఒక సందేశం ఉంది.

మర్హూమ్ అబ్దుల్ అజీమ్‌గారిలోని వైశిష్ట్యం ఏమిటంటే ఆయన ముస్లిం సముదాయంలో పూర్తిగా మమేకం అయిపోయారు. ఆలుబిడ్డలకు ధార్మిక శిక్షణ ఇవ్వటానికి అహోరాత్రులు శ్రమించారు. శ్రద్ధ వహించారు. పిల్లలను హైదరాబాదులోని దీనీ మదర్సాలో చదివించటంతోపాటు, ఉన్నత ఆధునిక విద్యను కూడా చదివించారు. ఈ శిక్షణా ప్రభావం ఆయన కుటుంబీకులపై ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మర్హూమ్ అంత్యక్రియల సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ప్రదర్శించిన అత్యుత్తమ సహనానికి, సంస్కారానికి అందరూ ముగ్ధులయ్యారు. ఒక ధార్మిక పాఠశాలలో చదువుకునే ఆయనగారి 16 ఏండ్ల అబ్బాయి, తన తండ్రి జనాజా నమాజ్‌కు సారథ్యం వహించటం (ఇమామత్ చేయటం) కూడా అందరికీ ఉదాహరణప్రాయం! గుణపాఠ సూచకం కూడా!! నమాజె జనాజాలో పాల్గొనటానికి కడప వాస్తవ్యులు కనబరచిన శ్రద్ధాసక్తులు కూడా మర్హూమ్ గారి 'స్వీకృతి'కి, ఆదరణకు ఒక తార్కాణమేనని మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు ఫోన్లో మాకు తెలియజేశారు.

"నిశ్చయంగా ఎవరు భయభక్తులతో వ్యవహరించి, సహన స్థయిర్యాలను కనబరుస్తారో, అటువంటి సజ్జనుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధా కానివ్వడు" (యూనుఫ్: 90) అన్న ఖుర్‌ఆన్ సూక్తి ఈ సందర్భంగా జ్ఞప్తికి రావటం సహజమే.

అలాగే –

"నిశ్చయంగా ఎవరు విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో, అలాంటి వారి పట్ల కరుణామయుడు (అయిన అల్లాహ్ అందరిలోనూ) ప్రేమానురాగాలను ప్రోది చేస్తాడు". (మర్యమ్ – 96) అన్న దైవ వచనం కూడా మదిలో మెదలక మానదు.

కారుణ్య ప్రభువైన అల్లాహ్ అబ్దుల్ అజీమ్ గారిని మన్నించి, దయతో ఆయన సేవలకు ఆమోదముద్ర వేయాలని, ఆయన కుటుంబీకులకు ఉత్తమ సహనాన్ని ప్రసాదించాలని, ఆయన కుటుంబీకులను సులువుగా సమస్యల నుండి గట్టెక్కించాలని మేము మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాము.

క్రియా శీల కార్యకర్తల శిక్షణా తరగతులు



ఐపిసి తెలుగు విభాగం, ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో జరిగిన "క్రియాశీల కార్యకర్తల శిక్షణా శిబిరం" విజయవంతంగా ముగిసింది. తెలుగు కమ్యూనిటీకి చెందిన ప్రత్యేక క్రియాశీల కార్యకర్తలు, న్యూ ముస్లిం సోదరులు మొత్తం 20 మంది ఈ శిక్షణా శిబిరానికి హాజరయ్యారు. నాలుగు వారాల పాటు జరిగిన సాప్తాహిక సమావేశంలో నెలవంక ఎడిటర్ శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, నెలవంక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మౌలానా సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ, ఐపిసి తెలుగు దాయి మౌలానా హబీబుర్రహ్మాన్ జామయి ప్రధాన వక్తలుగా ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో తోడ్పడిన "తెలుగు ముస్లిం అసోసియేషన్(టి.ఎమ్.ఎ)"కు ఐపిసి తెలుగు విభాగం కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.

కారు చీకట్ల నుంచి కాంతి రేఖల వైపునకు

IMA యూత్ వింగ్ కాన్ఫరెన్స్

ఇండియన్ ముస్లిం అసోసియేషన్ (కువైట్), యువజన విభాగం ఆధ్వర్యంలో 2010 ఏప్రిల్ 23వ తేదీన మస్జిదె కబీర్ ఆడిటోరియంలో ఓ చక్కటి సదస్సు జరిగింది. "కారు చీకట్ల నుంచి కాంతి రేఖల వైపునకు" అన్న ప్రధాన ఇతివృత్తం ఆధారంగా జరిగిన ఈ సదస్సుకు అమీరె జమాఅతె ఇస్లామీ హింద్ మౌలానా జలాలుద్దీన్ ఉమ్రీ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

సదస్సునుద్దేశించి ప్రసంగించిన జమాఅత్ ప్రముఖులలో జనాబ్ అమీనుల్ హసన్ (తమిళనాడు), జనాబ్ మలిక్ మోతసిమ్ ఖాన్ (ఆంధ్ర ప్రదేశ్) ఉన్నారు. కువైట్ వక్ఫ్ మంత్రిత్వ శాఖ – మస్జిదుల విభాగం – అండర్ సెక్రటరీ వలీద్ షుఐబ్, ఐపిసి కమ్యూనిటీస్ విభాగం ప్రతినిధి ఖాలిద్ అల్ – సబా సహా పలువురు కువైట్ ప్రముఖులు కూడా ఈ సదస్సులో ఆహూతులుగా పాల్గొన్నారు.





ఆసిమా బ్రాంచ్ న్యూ ముస్లింల విహార యాత్ర

IPC కువైట్ సిటీ (ఆసిమా బ్రాంచి), తెలుగు విభాగం ఆధ్వర్యంలో 30-04-2010వ తేదీ శుక్రవారం సాయంత్రం న్యూ ముస్లింలు "కువైట్ అక్వేరియం"ను సందర్శించారు. ఐ.పి.సి తెలుగు దాయీ మౌలానా సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ సారథ్యంలో జరిగిన ఈ విహార యాత్రలో 15 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతను తెలిపే రెండు నాటికలు కూడా ప్రదర్శించారు నూ ముస్లిం సోదరులు.







- అబుల్ కాసిమ్

నేటి బాలలే రేపటి పౌరులు

కోడి కూసింది...ఫజ్ర్ అజాన్ అయ్యింది... నిదానంగా వుజూ చేసుకుని దుఆ చేసుకుంటూ మస్జిద్‌కి బయలుదేరాడు అలీ. ఫజ్ర్ నమాజు ముగిసింది. నమాజులో ఇమామ్ గారు చదివిన దైవ వచనాల ప్రతిధ్వని అతన్ని ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది.

"నీవు వారికి ఈ గాథలను విన్పిస్తూ ఉండు. బహుశా వారు ఆలోచిస్తారేమో".

(దివ్య ఖుర్‌ఆన్ - 7: 176)

మానవుల్ని మేల్కొల్పటంలో గొప్ప వ్యక్తుల గాథలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని అతను గ్రహించాడు. ఇప్పుడు దైవం సూచించిన ఆ పథకాన్నే పిల్లలపై ప్రయోగించి చూడాలనుకున్నాడు. బాల విహార్‌లో ప్రవేశించాడు. పిల్లలందరికీ 'అస్సలాము అలైకుమ్ పిల్లలూ! మీరంతా ఎలా ఉన్నారు?' అని పలకరించాడు. పిల్లలు కూడ ఈ రోజు మంచి హుషారు మీదే ఉన్నారు.

పిల్లలూ! ఈ రోజు మీకు సెలవు. కాని నేను ముందుగా ఓ కథ చెబుతాను. ఆ తర్వాత మీ ఇళ్ళకి వెళుదురుగాని... అంటూనే, అనగనగా ఒక ప్రవక్త. ఆయన పేరు ఆదం ﷺ! ఈ భూగోళంపై ఆయనే తొలి మనిషి. ఆయన ప్రపంచ ప్రజలందరికీ మూల పురుషుడు. ఆయన్ని 'ఆది మానవుడు' అని కూడా అంటారు. ఆదం ﷺను అల్లాహ్ మట్టితో పుట్టించాడు! మట్టితో చేయబడ్డారంటే ఆశ్చర్య పడుతున్నారా? సర్వేశ్వరుడైన అల్లాహ్‌కు అన్నీ సాధ్యమే!!

పిల్లలందరూ గోలగా, గలిబిలిగా, గందర గోళంగా ఆరుస్తూ వచ్చి అతని చుట్టూ కూర్చున్నారు. అతను కథ చెబుతూ చెబుతూ మధ్యలో ఆపి వాళ్ళతో అన్నాడు. "చూడండి! అందరూ సరిగా కూర్చోండి. ఇలా అయితే కుదరదు".

అందరూ కుదురుగానే కూర్చున్నారు. అయితే "తొందరగా చెప్పండీ, తొందరగా చెప్పండీ, తరువాత ఏమయ్యిందండి, ఆ తరువాత ఏమయ్యిందండీ!" అంటూ ప్రాణం తోడేస్తున్నారు. అలీ తన పథకం బాగానే పని చేసిందనుకున్నాడు. చిరు నవ్వు నవ్వుతూ కథ ప్రారంభించాడు -

ఆ తరువాత అల్లాహ్ ఆదం ﷺకు సమస్త వస్తువుల పేర్లు, వాటి గుణగణాలు, ధర్మాలు, వాటి పనితీరు, వాటి వల్ల కలిగే లాభనష్టాలు...అంతా తెలియజేశాడు. ఆ తరువాత ఆదం ﷺకు గౌరవ సూచకంగా అభివాదం (సజ్దా) చెయ్యమని ఫరిష్తాలను (దైవ దూతలను) ఆదేశించాడు అల్లాహ్. అప్పుడు ఇబ్లీసు (షైతాన్) తప్ప అందరూ సజ్దా చేశారు. ఇబ్లీసు తనేదో గొప్పవాణ్ణన్న అహంకారంతో విర్రవీగాడు. అల్లాహ్‌కు విర్ర వీగేవారు అంటే బొత్తిగా ఇష్టం ఉండదు. కనుక షైతాన్‌ను తన దరి నుండి శపించి వెళ్ళగొట్టాడు.

పిల్లలు కళ్ళప్పగించి కథ వింటూ కూర్చున్నారు. బాల విహార్ అంతా నిశ్శబ్దంగా ఉంది. ఒక్కరు కూడా నోరెత్తడం లేదు. "ఈ క్లాసులో ఇంత ప్రశాంతత ఎలా ఏర్పడిందా?" అని మస్జిద్‌లో కూర్చుని ఉన్న పెద్దలు ఆలోచిస్తున్నారు.

అల్లాహ్ ఆదం ﷺ గారి పక్కటెముకతో మాతృమూర్తి అయిన మూల స్త్రీ హవ్వా ﷺను సృష్టించి స్వర్గంలో ఆదం ﷺ తోపాటు కలిసి జీవించమని ఆజ్ఞాపించాడు.

"ఓ ఆదం! నీవు, నీ భార్య స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు కోరుకున్నదల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే అదిగో! ఆ చెట్టు దరిదాపులకు మాత్రం వెళ్ళకండి" అని హెచ్చరించాడు అల్లాహ్.



అయితే మాయలమారి షైతాన్ వారిద్దరిని నిషిద్ధ వృక్షం గురించి లేనిపోని ఆశలు కల్పిస్తూనే ఉన్నాడు. చివరకు వారిద్దరూ షైతాన్ వలలో పడ్డారు, ఆ చెట్టు ఫలాన్ని తిని దైవ అవిధేయతకు పాల్పడ్డారు.

అల్లాహ్ వారిద్దరిని స్వర్గం నుంచి బహిష్కరించాడు. ఎందుకంటే, స్వర్గం ఉన్నది విధేయత చూపే వారి కోసమే గనుక. మరెవరైతే తిరస్కార ధోరణిని అవలంబిస్తారో వారికి స్వర్గ ప్రవేశం లేదు.

ఇప్పుడు కథ సగం పూర్తయింది. అందరినీ అడిగాడు...పిల్లలూ సెలవు కావాలా? కావాలంటే కథ ఆపివేస్తాను. కథే కావాలంటే కొనసాగిస్తాను...అందరూ ఒక్కసారిగా అరిచారు - "కథ చెప్పండి, మాకు కథే కావాలి. సెలవు అక్కర లేదు. అయితే మంచిదే! కథ వినండి.....

(సశేషం)



రుబా డి. ఖేర్

సేకరణ:
డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)

చర్చీల నుండి మస్జిద్‌ల వైపునకు - 3

"షట్ అప్... అబద్ధం చెప్పకు"
ఆ రోజు అక్టోబర్ 3 అనుకుంటాను, రుబా గుర్తు చేసుకున్నారు.

"నేను అబద్ధం చెప్పడం లేదు" అంటూ ఏడ్వడం మొదలెట్టాను.
విశ్వాసం లేకుండా షహాదా (సాక్ష్య వచనం) చెబితే అది (ఆ షహాదా) ముస్లిం కానివ్వదు అంటూ ఆ రోజు నువ్వే కదా చెప్పావు అని గుర్తు చేస్తూ, అబద్ధం చెప్పవద్దన్నాడు.

"నేను అబద్ధం చెప్పడం లేదు... రేపు రమజాన్ మొదటి రోజు...నీవు నాకు నమాజు ఎలా చేయాలో నేర్పబోతున్నావు. అలాగే ఇంకా ప్రతీ విషయమూనూ" అని రుబా అన్నారు.
నేను అలా చెప్పగానే...బేబీలాగా అతనికి కూడా ఏడుపు వచ్చింది.

నిజంగా ఒక్క రాత్రిలోనే నేను అవన్నీ నేర్చుకున్నాను...హిజాబ్ ఒకటి కొన్నాను.. నా స్నేహితురాలు దాన్ని ఎలా ధరించాలో అన్నీ వివరంగా తెలిపింది. నా ఇస్లాం గురించి (ఇంటిలో) రెండు వారాల పాటు దాచాను.
ఆ సమయంలోనే, నేను ఇమామ్ దగ్గరికెళ్ళి షహాదా పలికాను. ఖుర్‌ఆన్ నుండి నేర్చుకోవడం మొదలు పెట్టాను. రెండు గ్రంథాలనూ పోల్చి చూసేదాన్ని. ప్రారంభంలో బైబిల్ వదలడానికి చాలా కష్టంగా అనిపించింది. అల్‌హమ్‌దులిల్లాహ్ (కృతజ్ఞతలన్నీ అల్లాహ్‌కే). ఇప్పుడటువంటి దేమీ లేదు.
ఆమె ఇస్లాం స్వీకరించిన విషయాన్ని ఆమె కుటుంబానికి తెలియకుండా దాచారు. రాత్రి 2 గంటల నుండి 3 గంటల మధ్య నమాజు చేసుకునేవారు. ఆ సమయంలో అనుమానంతో తను చేసేది ఎవరూ చూడలేరని అలా చేసేవారు.

ఆమె ఖుర్‌ఆన్ మరియు హిజాబ్‌ను స్కూలుకి తీసుకెళ్ళి సంచిలో ఉంచుకొనే వారు. ఓ రోజు స్కూల్‌కి వెళుతున్నప్పుడు, ఆమె వీపుకి తగిలించుకున్న సంచిలో నుండి అనుకోకుండా ఆమె హిజాబ్ ఇంటిలోని మెట్ల మీద పడిపోయింది. ఆమె వెనుక చెల్లుంది. ఆమె చెల్లెలు చూసింది కాని ఆమెకి ఏమీ తెలియలేదు. రాత్రి లేచి రుబా నమాజు చేయటం చూసే వరకు ఆమెకి విషయం అసలు అర్థం కాలేదు. రుబా చెల్లెలు కుటుంబ సభ్యందరికీ ఈ విషయాన్ని చెప్పేసింది.
అప్పుడొచ్చింది సమస్య.
వారు తనపై అరిచారు, అవమానించారు, ఘోరమైన భాషలో ఆమెనెన్నో మాటలన్నారు. చచ్చేలా కొట్టారామెను. జడిపించారు కూడా. అంత జరిగినా ఆమె మౌనంగానే ఉన్నారు. కానీ వారందరినీ ఇస్లాం వైపు తీసుకురమ్మని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ రుబా ఇల్లు వదలి వచ్చేసింది.
ఆమె ముస్తఫాను వివాహం చేసుకునే వరకూ... రెండు నెలల పాటు తన స్నేహితురాలి దగ్గరే ఉన్నారు... అల్‌హమ్దులిల్లాహ్!

నేను నా కుటుంబాన్ని వదులుకున్నాను. కాని మస్జిద్ దగ్గర్లో మరో కొత్త ముస్లిం కుటుంబం నా గురించి శ్రద్ధ తీసుకుంది. అంతే కాదు, నిజంగా నాకు ఎంతో సాయం చేశారు. కృతజ్ఞతాభావంతో గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఎదురైన పరిస్థితుల గురించి ఇలా చెప్పారు:

నన్ను కొట్టిన దెబ్బల వలన....ఆ తరువాత నేను చాలా మానసిక ఒత్తిడికి గురయ్యాను. ఇప్పటికీ ప్రపంచ నలు మూలల నుండి కూడా కనీసం 25 ఫోన్ కాల్స్ మరియు ఈ – మెయిల్స్ వస్తూ ఉంటాయి. అవమానిస్తూ, బెదిరిస్తూ.

నాకు వచ్చే ఫోన్ కాల్స్ మాత్రమే కాకుండా, జోర్డాన్ మరియు అమెరికాలోని పెద్ద పెద్ద క్రైస్తవ ప్రొఫెసర్స్‌తో ఫోన్ వాదనలు కూడా జరిగేవి...మతాల గురించి వాదిస్తూ, నన్ను తిరిగి వెనక్కి క్రైస్తవంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తూ..." సుబ్‌హానల్లాహ్ (అల్లాహ్ పవిత్రుడు) నేను నా చేతుల్తో బైబిల్‌ని పట్టుకుని ఉండేదాన్ని కానీ వారి చేతిలో ఖుర్‌ఆన్. కథ అడ్డం తిరిగింది.
ఏదేమైనా, చాలా తక్కువ సమయంలోనే నేను చాలా నేర్చుకున్నాను.... సహనం తోనూ, వినయంగానూ ఉండటం నేర్చుకున్నాను. నేను ఇప్పుడు ధ్యానం చేస్తూ, దైవ ప్రవక్త ముహమ్మద్ (ﷺ) వారికి సంబంధించిన విషయాల గురించి ఆలోచిస్తుంటే ఆయన (ﷺ)కు ఎన్ని అవమానాలు! ఆయన (ﷺ) వాటన్నింటిని ఎలా భరించారో!....ఆయనతో పోలిస్తే నా కథ అసలు ఏమీ కాదనిపించింది. వావ్... నేను చాలా నేర్చుకున్నాను.

నా కుటుంబం యొక్క ఉన్నత గౌరవాన్ని నేను పోగొట్టుకుని ఉండవచ్చు. అలాగే కొంత మంది దృష్టిలో నాకున్న గౌరవాన్ని కూడా. కాని అల్లాహ్ నుండి వస్తున్న గౌరవానికి నేను గర్వపడుతున్నాను, ఆశ్చర్య పోతున్నాను. మీరసలు ఊహించ లేరు. అలాంటి అవమానాలలో సయితం నేను ఎటువంటి సంతోషం, శాంతితో బ్రతుకు తున్నానో!"
నిజంగా నేను పూర్వం కంటే చాలా మారిపోయాను. నేను పూర్తిగా భిన్నమైన వ్యక్తిని...నా భర్త సయితం ఇది గుర్తించారు. నన్ను ఎల్లవేళలా అవమానించే వారితో సయితం నేను ఎలా మౌనంగా, సహనంతో ఉండాలో నేర్చుకున్నాను.

(మిగతాది 20వ పేజీలో)

లాభసాటి వర్తకం

"అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా? దాన్ని ఆయన ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు".

(అల్ బఖర: 245)

'మంచి రుణం' అంటే భావం దైవ మార్గంలో ఖర్చు పెట్టడం, ధన త్యాగం చేయటం, దైవ ధర్మ ఉన్నతి కోసం కష్టపడి చెమటోడ్చి సంపాదించిన సొమ్మును మనస్ఫూర్తిగా అర్పించటం. మహాప్రవక్త ప్రియ సహచరుల జీవితాలు దీనికి ప్రతిబింబంగా నిలిచాయి.

దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి అవతరించినప్పుడు అబూ దహ్‌దాహ్ (రదియల్లాహు అన్హు) అనే సహాబి అమితంగా ప్రభావితులై 'ఓ దైవ ప్రవక్తా! ఏమిటి, అల్లాహ్ మా నుండి రుణం అడుగుతున్నాడా?' అని ప్రశ్నించారు. "అవున"ని ఆయన (స) చెప్పగానే 'ఏదీ, తమరి చేయిని చాపండి దైవ ప్రవక్తా!' అని అబూ దహ్‌దాహ్ (రదియల్లాహు అన్హు) కోరారు. దైవప్రవక్త (స) తన చేయిని చాపగానే, 'నాకెంతో ప్రియమైన నా తోటను, 600 ఖర్జూర వృక్షాలు గల తోటను దైవ మార్గంలో ఇచ్చేస్తున్నాన'ని మాటిచ్చారు.

ఆ తరువాత ఆయన (రదియల్లాహు అన్హు) తిన్నగా తన తోట వద్దకు వచ్చి, ఆ తోటలోనే ఉన్న తన సతీమణిని, పిల్లల్ని కేకేశారు – 'ఓ ఉమ్మె దహ్‌దాహ్! మీరంతా బయటకు రండి. ఇక ఈ తోట మనది కాదు ప్రభువు ప్రీతి కోసం నేనీ తోటను నా ప్రభువుకు ఇచ్చేశాన'న్నారు.

ఈ మాటలు విన్న ఆ ఇల్లాలు బాధ పడలేదు. భర్తను నిందించలేదు సరికదా, భర్త ఆజ్ఞను శిరసావహిస్తూ సంతోషంగా తోట విడిచి వచ్చేసింది. పైగా ఆ వినయవతి ఇలా అన్నది: **'ఓ అబూ దహ్‌దాహ్ (రదియల్లాహు అన్హు)! మీరు చేసిన ఈ బేరం భలె మంచి బేరం. ఈ వర్తకం భలే లాభసాటి వర్తకం!'**

ఎటువంటి విధేయులు వారు!

ఎటువంటి ఆదర్శప్రాయులు వారు!!

దైవ దూతలు 'గుసుల్' ఇచ్చిన వేళ...

దైవ ప్రవక్త ప్రియ సహచరులలో హంజ్రత్ హన్సలా బిన్ అబూ ఆమిర్ (రదియల్లాహు అన్హు) ఒకరు. ఈయన పెండ్లి చేసుకున్నారు. నవ వధువుతో మొదటి రాత్రి గడుపుతున్నారు. అదే సమయంలో వీధిలో పిలుపు – "ఓ దైవ యోధులారా! ధర్మ యుద్ధానికి బయలుదేరండి".

అంతే! ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా పడకపై నుంచి లంఘించారు హన్సలా. ఖడ్గం చేబూని, గుర్రంపై స్వారీ అయ్యారు. ఇరు పక్షాల మధ్య భీకర పోరు సాగుతోంది. శత్రు సైనికుల పంక్తుల్లోకి చొచ్చుకుపోయి వీర మరణం పొందారు ఈ యువ కిశోరం. సహచరులు హన్సలా అంత్యక్రియలకు సన్నాహాలు చేస్తుండగా దైవ ప్రవక్త (స) వచ్చి, "మీ ఈ సహచరుణ్ణి దైవ దూతలు స్వయంగా స్నానం చేయించారు. ఈ విషయాన్ని ఇతని పెళ్ళికూతురికి తెలిపి రండి" అన్నారు. ఈ సంగతి తెలిసినప్పుడు ఆ వితంతు వధువు ఇలా చెప్పింది: "యుద్ధ ప్రకటన గురించి విన్నప్పుడు ఆయనగారు 'జనాబత్' (లైంగిక అశుద్ధావస్థ)లో ఉన్నారు. ఆజ్ఞాపాలనలో ఆలస్యం కారాదన్న ఉద్దేశంతో హుటాహుటిన బయలుదేరారు".

అల్లాహు అక్బర్! అలనాడు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పిలుపుపై హన్సలా (రదియల్లాహు అన్హు) తన ఇష్ట సఖితో గడిపే మధుర క్షణాలను త్యాగం చేసి కదన రంగంలో దూకారు. దైవ దూతలచే స్వాగత సత్కారాలు అందుకుని స్వర్గానికి పయనమయ్యారు.

కాని – ఈనాడు ప్రతి రాత్రి ప్రశాంతంగా, తృప్తిగా నిక్షేపంగా నిద్రపోతున్న మనం కనీసం తెల్లవారు జామున మస్జిద్ లౌడ్ స్పీకర్ నుంచి వినిపించే పిలుపుకు సమాధానమిస్తున్నామా!? ఆ పిలుపు కదన రంగానికి కాదు, మన పేటలో ఉన్న మస్జిదుకే! కేవలం పావు గంట కోసమే. **'అస్సలాతు ఖైరుమ్ మినన్ నౌమ్'** (నమాజు నిద్రకంటే మేలైనది సుమీ!) అని పిలిచేవాడొకడు పిలుస్తున్నాడు. ఆ పిలుపు మన కర్ణ పుటాలకు తాకుతూనే ఉంది. కాని మనం మాత్రం ప్రాక్టికల్‌గా "అన్నౌము ఖైరుమ్ మినస్సలాత్" (నిద్ర నమాజుకన్న మేలైనది) అని సమాధానమిస్తున్నాం. శోచనీయం! మన వైఖరి కడు శోచనీయం!!

(19 పేజీ మిగతా భాగం – చర్చీల నుండి...)

అలాంటి కష్ట కాలాలలో (నా ఉద్యోగం పోగొట్టుకున్నప్పుడు సయితం) ఎలా చిరునవ్వుతో ఉండవచ్చునో నేర్చుకున్నాను. కాని అల్లాహ్ ఆ నష్టాన్ని పూరిస్తున్నాడు.

ఇదంతా నీ లోపల నిర్బంధ శాంతి కలగాలని...నీవు నిజంగా నీ చుట్టూ ఉండేవారి నుండి శాంతిని కనుగొనలేవు... నీ చుట్టూ ఉండే వాతావరణం వలన గాని... నీ అంగీకారం వలననే, నీ మనస్సు వలననే... (శాంతిని కనుగొనగలవు). నీ మనస్సును అల్లాహ్‌కు అంకితం చేసి ఆయనను ప్రేమించడం వలననే... నీవు అల్లాహ్‌ను ఆరాధించినట్లయితే, ఆయన ఆదేశాలను అనుసరించినట్లయితే నీవు ఖచ్చితంగా సంతోషంగా ఉంటావు. ఎందుకంటే, చేసే పాపాలు నిన్ను దోషివనే భావనను కలిగించి, నీ నుండి శాంతిని దూరం చేస్తాయి.

నేను కొందరి ముఖాలను, వారి కళ్ళల్లో నీటిని, విచారాన్ని చూశాను. వారంతా సృష్టికర్తకు దూరంగా ఉన్నారు. కొన్నిసార్లు నేను వారి హృదయంలోని చీకటిని చూశాను. వారు అందులోని జ్యోతిని వెలగనివ్వరు. ఎందుకంటే వారు జీవితంలో తలమునకలై ఎన్నో సమస్యలలో చిక్కుకున్నారు".

ఇప్పుడు నేను తెలుసుకున్నదంతా – ఈ జీవితంలో నా లక్ష్యం – ఆరాధించడం, అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఆయన ఆదేశాలను, నియమాలనూ అనుసరిస్తూ ఆయన కొరకు మంచి పనులు చేయడం.

చివరిగా మన ప్రియతమ సోదరి ఇలా అన్నారు:

"మీ ఆత్మకు బలంగా నా ఈ కథను మీరు ఎంజాయ్ చేసి ఉంటారని నేనను కుంటున్నాను. అసలైన సత్యాన్ని కనుగొన్న సోదరి 'రుబా డి.ఖేర్' గురించి మీ కందించే అవకాశాన్ని కల్పించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు.

వివేచన

భిక్షాటన

ఇస్లాం మనిషిని బ్రతుకు తెరువు కోసం ఉపాధి మార్గాలను అన్వేషించమని ఆదేశిస్తుంది. మనిషి ఇతరులపై ఆధారపడకుండా తన కష్టార్జితంతో జీవితం గడపాలన్నది దాని అభిమతం. ఆ విధంగా మనిషి నలుగురి ముందు ముష్టెత్తుకునే నికృష్ట స్థితి నుండి నలుగురికీ సహాయం చేసే స్థాయికి ఎదగాలన్నది దాని ఉద్దేశ్యం. కాబట్టి భిక్షాటనను అది అవాంఛనీయమైన చేష్టగా పరిగణిస్తుంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ బిన్ అవ్వామ్ (రదియల్లాహు అన్హు) గారి కథనం: దైవప్రవక్త (ﷺ) ఇలా అన్నారు: "ప్రజల ముందు చేయి చాచి ముష్టెత్తుకోవడంకన్నా తాడు తీసుకుని కొండపైకెళ్లి, వీపు మీద కట్టెల మోపు తీసుకొచ్చి అమ్ముకొని డబ్బు సంపాదించుకోవటం ఎంతో మేలు. పైగా అలా చేస్తే అల్లాహ్ అతని ఆత్మాభిమానాన్ని కాపాడుతాడు. అదే ప్రజల దగ్గర అడుక్కుంటే వారు ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు." (బుఖారీ)

పూర్వకాలంలో దైవప్రవక్తలు సైతం కొలిమి పని, గొర్రెల్ని మేపే పని చేసి డబ్బు సంపాదించేవారు. కాబట్టి ఏ వృత్తినీ, ఏ ఉపాధినీ అల్పమైనదిగా భావించ కూడదు. స్వభావపరంగా ఏ వృత్తీ నీచమైనది, అంటరానిది కానప్పుడు, వృత్తుల ప్రాతిపదికపై మానవ సమాజాన్ని వర్ణాలుగా, కులాలుగా విభజించి, కొందరిని జన్మతః అస్పృశ్యులు, అధములు క్రింద జమకట్టడం, మరి కొందరికి లేనిపోని పవిత్రతను కల్పించటం ముమ్మాటికీ గర్హనీయం. కాయకష్టం చేసేవారు వాస్తవానికి దైవప్రవక్తల వృత్తుల్ని, విధానాల్ని అనుసరిస్తున్నారు. కాబట్టి వారు ఆత్మ న్యూనతకు లోను కానవసరం లేదు. అందరిలాగే వారికి కూడా సముచితమైన స్థాయి, గౌరవ మర్యాదలు లభించాలి. వృత్తి, ప్రవృత్తి విషయంలో ఇదే ఇస్లాం మానవాళికిచ్చే సందేశం.





మీ వాణిజ్య ప్రకటనలను స్వాగతిస్తోంది. అధర్మమైన, అసభ్యకరమైన, అశ్లీలంతో కూడిన విషయాలు తప్ప మిగిలిన ప్రకటనలన్నీ వేయబడతాయి.

	Description	Advertisement Rate	30% Discount for One year	20% Discount for one Month
1	Inside Page of Front Cover	KWD 150	KWD 105	KWD 120
2	Inside Page of Back Cover	KWD 150	KWD 105	KWD 120
3	Single Page Inside	KWD 100	KWD 70	KWD 80
4	Two middle pages	KWD 200	KWD 140	KWD 160
5	Back Cover Page	KWD 200	KWD 140	KWD 160

Half Page : Half of the above mentioned rates ❖ Quarter Page : Quarter of the above mentioned rates

contact: abdussalamsyed@ymail.com, Tel.No: 66104547, 97248933